



Truth of News
RNI NO : APTEL/25/A0239
# సూర్య వాస్తవం
http://www.suryavastavam.in
చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

సంపుటి: 01 చిత్తూరు సంచిక : 238 బుధవారం 18 ఫిబ్రవరి 2026 పేజీలు : 9 వెల రూ.6.50
irculated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi

## ఏఐ సదస్సులో గందరగోళం

**- భారీగా తరలివచ్చిన ప్రజానీకం**
**ప్రధాని మోడీ రాకతో భద్రత పెంపు..**
**ప్రజలకు తప్పని అవస్థలు**




న్యూఢిల్లీ - సూర్య వాస్తవం

దేశ రాజధానిలోని భారత్ మండపంలో మంగళవారం ప్రారంభమైన ఏఐ సదస్సులో తొలి రోజు గందరగోళం నెలకొంది. పెద్ద ఎత్తున తరలివచ్చిన ప్రజలను అదుపు చేయడంలో నిర్వాహకులు విఫలమయ్యారు. సదస్సుకు హాజరైన ప్రతినిధులకు తగిన భద్రత, రక్షణ కల్పించలేక ఇబ్బంది పడ్డారు. ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ పర్యవేక్షణలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. హాజరయ్యే

- మిగతా 2లో..

## కాంగ్రెస్‌కు మరో 7 మున్సిపాల్టీలు

- బీఆర్ఎస్‌కు 1
- మూడింటి ఎన్నిక మళ్లీ వాయిదా
- కోర్టు ఉత్తర్వులతో ఇబ్రహీంపట్నం ఫలితం నిలిపివేత
- కోడ్ఆఫ్ కండక్ట్‌ను ఎత్తేసిన ఎన్నికల సంఘం

హైదరాబాద్ - సూర్య వాస్తవం

సోమవారం వాయిదా పడ్డ 11 మున్సిపాల్టీల పాలక మండళ్లకు మంగళవారం ఎన్నికలు నిర్వహించారు. వివిధ కారణాల వల్ల 3 స్థానాల్లో ఎన్నిక మళ్లీ వాయిదా పడింది. దాంతో 8 మున్సిపాల్టీల పాలక మండలిని సభ్యులు ఎన్నుకున్నారు. అందులో 7 కాంగ్రెస్‌కు దక్కగా, ఒకటి బీఆర్ఎస్ గెలుచుకుంది. ఇబ్రహీంపట్నం, క్యాతన్‌పల్లి, ఖానాపూర్ మున్సిపాల్టీల్లో ఎన్నికలు వాయిదా వేస్తున్నట్లు ఎన్నికల సంఘం అధికారులు ప్రకటించారు. లక్కీ డ్రాలో తొర్రూర్ మున్సిపాల్టీని కాంగ్రెస్ తన ఖాతాలో వేసుకుంది. మంగళవారం జరిగిన ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థులు తుణం శ్రవణ్ చైర్మెన్‌గా, సోమ రజినీ వైఎస్ చైర్మెన్‌గా ఎన్నికయ్యారు. ఇల్లందులో దొడ్డ కిరణ్ మిత్ర, సుల్తానాబాద్‌లో అంతటి పుష్పలత, కాగజ్‌నగర్‌లో షాహిన్ సుల్తానా, జహీరాబాద్‌లో యూనస్, డోర్నకల్‌లో కొండేటి రాజకుమారి కాంగ్రెస్ నుంచి చైర్మెన్‌గా ఎన్నికయ్యారు. ఇంద్రేశం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థి పి.హరీశ్‌రెడ్డి చైర్మెన్‌గా ఎన్నికయ్యారు. కాగా రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మున్సిపాల్టీ వివాదం హైకోర్టుకు చేరింది. 19వ వార్డు కౌన్సిలర్ ఆకుల యాదగిరిని ఎవరో కిడ్నాప్ చేశారని ఆయన కొడుకు హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశాడు. ఈ పిటిషన్‌ను విచారించిన హైకోర్ట్ గురువారం తమ ముందు యాదగిరిని హాజరు పర్చాలని పోలీసులకు ఆదేశాలు జారీ చేసింది. అయితే కోర్ట్ అర్డర్ అందక ముందే ఇబ్రహీంపట్నం చైర్మెన్ ఎన్నికను అధికారులు పూర్తి చేశారు.

- మిగతా 2లో..



## రాహుల్‌కు ఊరట

**- బీజేపీ పరువునష్టం కేసును కొట్టేసిన కర్నాటక హైకోర్టు**

బెంగళూరు - సూర్య వాస్తవం

పరువు నష్టం కేసులో లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి ఊరట దక్కింది. 2023 మే ఐదవ తేదీన వార్తాపత్రికలలో ఇచ్చిన ఓ ప్రకటనకు సంబంధించి రాహుల్‌పై బీజేపీ దాఖలు చేసిన పరువు నష్టం కేసును కర్నాటక హైకోర్టు మంగళవారం కొట్టివేసింది. అప్పటి అధికార బీజేపీ ప్రభుత్వంపై ‘అవినీతి రేట్ కార్డ్’ పేరిట ఈ ప్రకటన ఇచ్చారు. తనపై నమోదైన పరువు నష్టం కేసును సవాలు చేస్తూ రాహుల్ గాంధీ దాఖలు చేసిన పిటిషన్‌ను న్యాయస్థానం అనుమతించింది. కర్నాటక పీసీసీ, రాహుల్ గాంధీ, ప్రస్తుత ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ప్రస్తుత ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ కలిసి బీజేపీని అప్రదిష్టపాలు చేసేందుకు కుట్ర పన్నారని, దానిలో భాగంగానే వార్తాపత్రికలలో ప్రకటన ఇచ్చారని ఫిర్యాదులో ఆరోపించారు. బీజేపీకి

2లో

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

## డేటా సెంటర్లకు రాయితీలపై అధ్యయనం

- భూపరిహారం నిర్ణయంలో ఉదారంగా వ్యవహరించండి
- నూతన మున్సిపల్ పాలకమండళ్లతో త్వరలో సమావేశం
- వారికోసం ఒక్కరోజు శిక్షణ
- మున్సిపాల్టీల్లో ప్రకటనల ఆదాయం పెంచండి
- మల్టీలెవల్ పార్కింగ్, స్కైవాక్ మార్కెట్లపై స్టడీ చేయండి
- విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు
- సమీక్షా సమావేశాల్లో సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్ - సూర్య వాస్తవం

డేటా సెంటర్లకు వివిధ రాష్ట్రాలు ఇస్తున్న రాయితీలపై అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి ఎ రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో డేటా సెంటర్ల ఏర్పాటుకు ముందుకు వచ్చిన సంస్థలు, వారికి అవసరమైన భూమి, ఇతర వసతులపై డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయం లో

- మిగతా 2లో..

## ఏపీలో టెక్ పాలన అమోఘం...

- సోషల్ మీడియాలోనూ ఆశ్చర్యం వ్యక్తం చేసిన బిల్ గేట్స్!
- ఏపీలో పర్యటించిన బిల్ గేట్స్
- సీఎం చంద్రబాబుతో కలిసి ఆర్టీజీఎస్ సందర్శన
- పాలనలో, అభివృద్ధిలో టెక్నాలజీ వినియోగాన్ని చూసి ఆశ్చర్యపోయిన గేట్స్

అమరావతి - సూర్య వాస్తవం



కృత్రిమ మేధ (ఏఐ), టెక్నాలజీ వినియోగంతో ఆంధ్రప్రదేశ్ సాధిస్తున్న అభివృద్ధిని చూడటం ఎంతో ఉత్సాహంగా అనిపించిందని మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు, బిల్ అండ్ మెలిండా గేట్స్ ఫౌండేషన్ చైర్మన్ బిల్ గేట్స్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ పర్యటనలో తనకు ఘన స్వాగతం పలికినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆయన

- మిగతా 2లో..



## మదనపల్లె బాలిక హత్యపై సీఎం చంద్రబాబు తీవ్ర విచారం

- నిందితుడిని వదిలిపెట్టేది లేదని కుటుంబానికి భరోసా
- బాలికపై అత్యాచారం చేసి హత్య చేసినట్లు అనుమానం
- నిందితుడిని కఠినంగా శిక్షిస్తామన్న హోం మంత్రి అనిత

2లో



## విశాఖ తీరంలో నేడే ఐఎఫ్ఆర్ కోలాహలం

- సముద్రంలో 6 వరుసల్లో 71 యుద్ధ నౌకలు, జలాంతర్గాములు, 50 యుద్ధ విమానాలు
- 55 దేశాల నుంచి నావికాదళాధికారులు హాజరు
- యుద్ధనౌకల ప్రతిభా పాటవాలను సమీక్ష చేయనున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

2లో

# కాంగ్రెస్‌కు మరో 7 మున్సిపాల్టీలు

(మొదటిపేజీ తరువాయి)
బీఆర్ఎస్ అభ్యర్థి సుదర్శన్‌రెడ్డి మున్సిపల్ చైర్మెన్‌గా ఎన్నికయ్యారు. హైకోర్ట్ ఎన్నికపై స్టే విధించడంతో ఆయనకు అధికారులు ధ్రువీకరణ పత్రం ఇవ్వలేదు. సోమవారం 105, మంగళవారం మరో 8 పాలక మండళ్లకు జరిగిన ఎన్నికల్లో మొదటి రోజు 81, రెండో రోజు మరో 7తో కలిపి కాంగ్రెస్ అత్యధికంగా 88 మున్సిపాల్టీలను దక్కించుకుంది. బీఆర్‌స్‌కు మొదటి రోజు 18, రెండో రోజు ఒక దానితో కలిపి మొత్తం 19 మున్సిపాల్టీలు దక్కాయి. ఇంకా 3 మున్సిపాల్టీల ఫలితాలు తేలాల్సి ఉంది. కాగా వీటిని ఎప్పుడు నిర్వహించేది ఎన్నికల కమిషన్ ప్రకటించలేదు. ఈ నెల 19న కోర్ట్ నిర్ణయం తర్వాత మిగిలిన మూడు మన్సిపాల్టీల పాలక మండళ్లకు ఎన్నిక నిర్వహించే అవకాశం ఉందని భావిస్తున్నారు. కాగా 112 మున్సిపాల్టీలు, 7 కార్పొరేషన్ల పాలక మండళ్ల ఎన్నిక పూర్తి కావడంతో కోడ్ ఆఫ్ కండక్ట్‌ను ఎత్తి వేస్తున్నట్టు ఎన్నికల సంఘం ప్రకటించింది.

# ఏఐ సదస్సులో గందరగోళం

(మొదటిపేజీ తరువాయి)
వారి కోసం క్యూఆర్ కోడ్ రిజిస్ట్రేషన్ విధానాన్ని ప్రవేశపెట్టారు. సదస్సు ప్రారంభానికి ముందే రెండున్నర లక్షల మంది తమ పేర్లు నమోదు చేసుకున్నారు. వేదిక సామర్థ్యానికి మించి రిజిస్ట్రేషన్లు జరగడంతో నిర్వాహకులు వాటిని నిలిపివేశారు. భారత్ మండపంలో ప్రతి సంవత్సరం ట్రేడ్ ఫెయిర్ జరుగుతుంటుంది. రోజుకు లక్ష మంది వరకూ రాకపోకలు సాగించవచ్చు.

కాగా సదస్సు మొదటి రోజు 80,000 మంది వచ్చారని, వీరంతా ఒకే సమయానికి రావడంతో గందరగోళం ఏర్పడిందని నిర్వాహకులు తెలిపారు. అదే సమయంలో వీవీఐపీల తాకిడి కూడా పెరగడంతో ప్రజలను అదుపు చేయడం సవాలుగా మారింది. ఒక దశలో పరిస్థితి అదుపు తప్పినట్లు కనిపించినా ఆ తర్వాత అదుపులోకి వచ్చింది. సదస్సుకు పెద్ద ఎత్తున తరలివచ్చిన ప్రజలు క్యూ లైనులో చాలా సేపు నిరీక్షించాల్సి వచ్చింది. ఏ గేటు ద్వారా లోపలికి పంపుతారో తెలియని పరిస్థితి ఏర్పడింది. సదస్సు ప్రారంభానికి ప్రధాని నరేంద్ర మోడీ విచ్చేయడంతో భారీగా భద్రతా ఏర్పాట్లు చేశారు. దీంతో సామాన్య ప్రజలు మరింతగా ఇబ్బంది పడ్డారు. ప్రజలకు కనీసం తాగునీరు, ఆహారం కూడా అందించలేకపోయారు. అవి ఎక్కడ లభిస్తాయో తెలిపే సైన్ బోర్డులు కూడా కన్పించలేదు. భద్రతా సిబ్బంది అధిక సంఖ్యలో మోహరించడంతో ప్రజలు ముందుకు సాగలేని పరిస్థితి తలెత్తింది. నిర్వాహకులు, పోలీసులు, భద్రతా సిబ్బంది మధ్య సమన్వయం లోపించింది. కేంద్రప్రభుత్వ నిర్వహణ తీరుపై వచ్చిన ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ క్షమాపణలు చెప్పారు.

# రాహుల్‌కు ఊరట

(మొదటిపేజీ తరువాయి)
వ్యతిరేకంగా అందులో నిరాధారమైన ఆరోపణలు చేశారని తెలిపారు. దీనిపై విచారణ జరిపిన ప్రత్యేక కోర్టు... నిందితులపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. దీనిని సవాలు చేస్తూ నిందితులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు.

# ఏపీలో టెక్ పాలన అమోఘం...

(మొదటిపేజీ తరువాయి)
ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు ఆయన చంద్రబాబు చేసిన ట్వీట్ ను ఎక్స్ ఖాతాలో రీపోస్ట్ చేశారు. బిల్ గేట్స్ ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించారు. గన్నవరం విమానాశ్రయంలో రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్, ఇతర మంత్రులు ఆయనకు స్వాగతం పలకగా, అమరావతిలోని సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా ఆహ్వానించారు. అనంతరం చంద్రబాబుతో కలిసి ఆయన రియల్ టైమ్ గవర్నెన్స్ సిస్టమ్ కేంద్రాన్ని సందర్శించి, దాని పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆరోగ్యం, వ్యవసాయం, విద్య వంటి రంగాల్లో సాంకేతికత, ఏఐ ఆధారిత ఆవిష్కరణల వినియోగంపై ఇరువురు నేతలు చర్చించారు. 1990లలో గేట్స్‌తో జరిగిన తొలి సమావేశమే తనకు స్ఫూర్తినిచ్చిందని, ఇప్పుడు ఏపీలో టెక్నాలజీతో సాగుతున్న పాలనను ఆయనకు చూపించడం సంతోషంగా ఉందని చంద్రబాబు ఎక్స్ వేదికగా తెలిపారు. ఈ పర్యటనలో భాగంగా గేట్స్ ఉండవల్లిలో అరటి తోటను సందర్శించి, సహజ వ్యవసాయ పద్ధతులను పరిశీలించారు. ఢిల్లీలో జరగనున్న ఏఐ సమ్మిట్‌కు వెళ్లే ముందు ఆయన ఏపీకి వచ్చారు. ఈ పర్యటనతో రాష్ట్రంలో ఆరోగ్యం, వ్యవసాయ రంగాల్లో పలు ప్రాజెక్టులకు మద్దతిస్తున్న గేట్స్ ఫౌండేషన్‌తో రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యం మరింత బలోపేతం కానుంది.

# జెఈఈ మెయిన్స్‌లో మెరిసిన ఆణిముత్యం

**బ్రహ్మంగారిమఠం - సూర్య వాస్తవం:**



బ్రహ్మంగారిమఠం మండలం టౌన్ పరిధిలోని స్థానిక వీరనారాయణపురం కు చెందిన లింగాలదిన్నె జగన్ మోహన్ రెడ్డి ధనలక్ష్మి వారి కుమారుడు మోజిత్ సింహా రెడ్డి(కుడి వైపు) జేఈఈ మెయిన్స్ ఫలితాలలో 98.10 శాతం మార్కులతో తమ ప్రతిభను కనబర్చటం పట్ల బ్రహ్మంగారి మఠం మండల ప్రజలతో పాటు బంధువులు స్నేహితులు శ్రేయోభిలాషులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.పదవ తరగతి ఫలితాల్లో కూడా మంచి ప్రతిభ కనబరచడం జరిగింది. ప్రస్తుతం ఆ విద్యార్థి బీరం శ్రీధర్ రెడ్డి విద్యాసంస్థలలో విద్యను అభ్యసిస్తున్నాడు.

### మదనపల్లె బాలిక హత్యపై
# సీఎం చంద్రబాబు తీవ్ర విచారం

- **నిందితుడిని వదిలిపెట్టేది లేదని కుటుంబానికి భరోసా**
- **బాలికపై అత్యాచారం చేసి హత్య చేసినట్లు అనుమానం**
- **నిందితుడిని కఠినంగా శిక్షిస్తామన్న హోం మంత్రి అనిత**

**అమరావతి - సూర్య వాస్తవం**
అన్నమయ్య జిల్లా మదనపల్లెలో ఏడేళ్ల బాలిక దారుణ హత్యకు గురైన ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రంగా స్పందించారు. ఆయన బాలిక తల్లిదండ్రులకు ఫోన్ చేసి పరామర్శించారు. ఈ ఘాతుకానికి పాల్పడిన వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టేది లేదని, నిందితుడికి కఠిన శిక్ష పడేలా చూస్తామని వారికి హామీ ఇచ్చారు. ఈ దారుణ ఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపింది.

వివరాల్లోకి వెళితే.. మదనపల్లెలో మూడు రోజుల క్రితం అదృశ్యమైన ఏడేళ్ల బాలిక, చివరకు శవమై తేలింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు, బాలిక మృతదేహాన్ని ఎదురింట్లో గుర్తించారు. ఆ ఇంట్లో నివసించే కులవర్ధన్ అనే వ్యక్తిపై అనుమానంతో అతడిని అదుపులోకి తీసుకున్నారు. బాలికపై అత్యాచారం చేసి, ఆపై హత్య చేసినట్లు పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. ఈ ఘటన తెలియగానే స్థానికంగా తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. నిందితుడిని తమకు అప్పగించాలని డిమాండ్ చేస్తూ బాలిక కుటుంబ సభ్యులు, స్థానికులు మదనపల్లె-కదిరి బైపాస్ రోడ్డుపై ఆందోళనకు దిగారు. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. జిల్లా ఎస్పీ, సబ్ కలెక్టర్ ఘటనా స్థలానికి చేరుకుని, ఆందోళనకారులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. హోం మంత్రి వంగలపూడి అనిత కూడా బాలిక కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడి ధైర్యం చెప్పారు. నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి, బెయిల్ రాకుండా కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ పెద్దల భరోసాతో కుటుంబ సభ్యులు ఆందోళన విరమించి, బాలిక మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించేందుకు అంగీకరించారు.

# డేటా సెంటర్లకు రాయితీలపై అధ్యయనం

(మొదటిపేజీ తరువాయి)
ఉన్నతాధికారులతో ఆయన సమావేశమ య్యారు. డేటా సెంటర్లకు భూ కేటాయింపులో హేతుబద్ధత ఉండాలనీ, వీటికోసం వివిధ ప్రాంతాల్లో కల్పిస్తున్న మౌలిక వసతుల కల్పన, భూ సేకరణపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. భూ పరిహారం నిర్ణయం విషయంలో ఉదారంగా ఉండాలని సూచించారు. రైతులను పిలిచి మాట్లాడి వారు సంతృప్తి చెందేలా పరిహారం నిర్ణయించాలని చెప్పారు. రూ.వేల కోట్లతో పెట్టుబడులు పెట్టే సంస్థలు భూమిపై పెట్టే పెట్టుబడి చాలా స్వల్పమనీ, కంపెనీలకు సకాలంలో భూమి, ఇతర వసతులు అందుబాటులో ఉంచితే త్వరగా పనులు పూర్తి చేసుకుంటారని అన్నారు.

అనంతరం ఆయన పురపాలకశాఖపై ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే రామకృష్ణారావు, సీఎం కార్యదర్శి మాణిక్‌రాజ్, హెచ్‌ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి కమిషనర్లు ఆర్వీ కర్ణన్, సృజన, వినయకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ రాష్ట్రంలో నూతనంగా ఎన్నికైన మేయర్లు, డిప్యూటీ మేయర్లు, చైర్మెన్లు, డిప్యూటీ చైర్మెన్లతో త్వరలో ఒక్క రోజు శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నగరాలు, పట్టణాల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు, ఇతర అంశాలను వారికి వివరించాలని సూచించారు. తాను స్వయంగా ఆ సమావేశానికి హాజరై, నూతనంగా ఎన్నికైన వారితో మాట్లాడాతానని తెలిపారు.పట్టణాల్లో పారిశుధ్య నిర్వహణపై ఆయన అధికారుల్ని అడిగి తెలుసుకున్నారు. పరిసరాల పరిశుభ్రతకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. మున్సిపాల్టీల్లో ప్రకటనల ఆదాయం పెంచుకోవాలని సూచించారు.

గ్రేటర్ హైదరాబాద్‌లో మల్టీలెవల్ పార్కింగ్, స్కైవాక్ మార్కెట్లపై అధ్యయనం చేయాలని అధికారుల్ని ఆదేశించారు. రాజధాని హైదరాబాద్‌లో నూతనంగా ఏర్పడిన గ్రేటర్ హైదరాబాద్, మల్కాజ్‌గిరి, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో పారిశుద్ధ్యం, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. తానే స్వయంగా ఆయా మున్సిపాల్టీల్లో ప్రత్యక్ష పరిశీలనకు వస్తానన్నారు. ఎక్కడైనా చెత్త కనపడితే సహించేది లేదనీ, విధినిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పారిశుధ్య నిర్వహణ పరిశీలన కోసం ఆయా నగర పాలక సంస్థల కమిషనర్లు తెల్లవారు జామున ఆరు గంటలకే క్షేత్రస్థాయిలో పర్యటించాలని సూచించారు. ప్రకటనల ఆదాయం పెంపుదల పాలసీపై మాట్లాడుతూ నగరంలో కూడళ్లు, ఇతర ప్రాంతాల్లో స్మార్ట్ పోల్స్ ఏర్పాటు చేయాలనీ, ఎలక్ట్రిక్, ఇతర కేబుళ్లు, సీసీ కెమెరాలు, ప్రకటనల బోర్డులు వాటిపైనే ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని చెప్పారు. హైదరాబాద్ సిటీలో ప్రయివేటు భూముల్లోనూ మల్టీలెవల్ పార్కింగ్ ఏర్పాటుకు ఉన్న అవకాశాలపై అధ్యయనం చేయాలని చెప్పారు. నెక్లెస్ రోడ్డు పక్కన పలు ప్రాంతాల్లో మల్టీ లెవల్ పార్కింగ్ ఏర్పాటుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలన్నారు. ముంబయి, అహ్మదాబాద్, బెంగళూర్‌ల్లోని ప్రకటనల ఆదాయంతో నగరంలో వస్తున్న ఆదాయాన్ని సరిపోల్చాలని చెప్పారు. ప్రభుత్వ కార్యక్రమాలు, సంక్షేమ కార్యక్రమాల ప్రకటనలకు 10 శాతం బోర్డులు కేటాయించాలన్నారు. ఈ సందర్భంగా పీపీపీ, ఇతర నమూనాల్లో ఆదాయం సమకూర్చుకునే అంశంపై అధికారులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. రాష్ట్రంలోని అన్ని నగరాలు, పట్టణాల్లో వీధి దీపాల నిర్వహణ విషయంలో యూనికోడ్ సిస్టమ్ అనుసరించాలని అధికారులను ఆదేశించారు. పార్కుల వివరాలు సేకరించాలనీ, వాటి అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. అంతకుముందు జరిగిన డేటా సెంటర్ల సమీక్షలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) కె రామకృష్ణారావు, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి, ఐటీ శాఖ ప్రధాన కార్యదర్శి సంజయ్ కుమార్, విద్యుత్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్, ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కమిషనర్ శశాంక తదితరులు పాల్గొన్నారు.

# నిందితుడికి కఠిన శిక్ష విధించాలి

**- ఆర్‌సిడిఎస్ రాష్ట్ర అధ్యక్షులు సురేంద్ర రెడ్డి**
**- చిన్నారి రిషిక ప్రియ హత్యపై జాతీయ అధ్యక్షుడు తీవ్ర ఆగ్రహం**

**పులివెందుల - సూర్య వాస్తవం:**



మదనపల్లి టౌన్ నీరుగుటపల్లిలో 7 ఏళ్ల చిన్నారి రిషిక ప్రియను అతి దారుణంగా హత్య చేసిన ఘటన రాష్ట్రాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని రెడ్డి కమ్యూనిటీ డెవలప్మెంట్ సొసైటీ (ఆర్‌సిడిఎస్) జాతీయ అధ్యక్షులు యర్రపు రెడ్డి సురేంద్ర రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారంవిలేకరులతో మాట్లాడుతూ ఈ అమానుష ఘటన మహిళలు, చిన్నారుల భద్రతపై ప్రభుత్వ వైఖరిపై గంభీర ప్రశ్నలు లేవనెత్తుతోందన్నారు. చిన్నారి అదృశ్యమైన వెంటనే పోలీసులు అత్యవసరంగా, సమన్వయంతో స్పందించి ఉంటే ఈ పాశవిక హత్యను అడ్డుకోవడం సాధ్యంకాలేదా? అని ప్రశ్నించారు. పోలీసు వ్యవస్థలో ఎక్కడైనా నిర్లక్ష్యం, ఆలస్యం, లేదా సమాచారం పంచుకునే లోపం జరిగిందా ? అనే విషయాలపై ప్రభుత్వం ప్రజలకు స్పష్టమైన సమాధానం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. మహిళా, బాలికల భద్రతపై ప్రభుత్వం పదేపదే హామీలు ఇస్తున్నప్పటికీ, భూమిపై అమలు ఎందుకు బలహీనంగా ఉందో ప్రభుత్వం వివరించాలన్నారు. మదనపల్లి వంటి పట్టణాల్లో కూడా చిన్నారులకు భద్రత లేకపోవడం పాలనా వైఫల్యానికి సంకేతమా? భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా ప్రభుత్వం ఎలాంటి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించింది? అని ఆయన ప్రశ్నించారు. ఈ కేసులో నిందితుడిని త్వరగా పట్టుకుని చట్టపరంగా అత్యంత కఠిన శిక్ష విధించాలని, కేసును ఫాస్ట్ ట్రాక్ కోర్టులో విచారణకు పెట్టాలని ఆయనడిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయం, పూర్తి న్యాయం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయనకోరారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా బాలికలు, మహిళల భద్రత కోసం ప్రత్యేక మానిటరింగ్ వ్యవస్థ, అత్యవసర స్పందన బలగాలు, పోలీసు సమన్వయాన్ని బలోపేతం చేయాలని ఆయన సూచించారు. పసి పిల్లలు, మహిళల రక్షణలో ప్రభుత్వం ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని హెచ్చరించారు. ఈ ఘటనపై ఆర్‌సీడీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ లెక్కల మణికొండ రెడ్డి, కూడా తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ, నిందితుడికి కఠిన శిక్ష విధించి బాధిత కుటుంబానికి త్వరిత న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

### విశాఖ తీరంలో నేడే
# ఐఎఫ్ఆర్ కోలాహలం

- **సముద్రంలో 6 వరుసల్లో 71 యుద్ధ నౌకలు, జలాంతర్గాములు, 50 యుద్ధ విమానాలు**
- **55 దేశాల నుంచి నావికాదళాధికారులు హాజరు**
- **యుద్ధనౌకల ప్రతిభా పాటవాలను సమీక్ష చేయనున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము**

**గ్రేటర్ విశాఖ - సూర్య వాస్తవం:** విశాఖ సాగర తీరంలో బుధవారం అంతర్జాతీయ ఫ్లీట్ రివ్యూ (ఐఎఫ్ఆర్) ప్రధాన కార్యక్రమం జరుగనుంది. ఇప్పటికే 55 దేశాల నుంచి విశాఖకు నావికాదళాధికారులు చేరుకున్నారు. నౌకలు కొలువుదీరాయి. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము విశాఖకు చేరుకున్నారు. మంగళవారం బంగాళాఖాతంలోనూ, విశాఖ సాగర తీరంలోనూ యుద్ధనౌకల విన్యాసాల రిహార్సల్స్ జరిగాయి. బుధవారం ఉదయం 10 గంటలకు భారత రాష్ట్రపతి, త్రివిధ దళాల అధిపతి (సుప్రీం కమాండర్ ఆఫ్‌ది ఆర్మ్‌డ్ ఫోర్సెస్) ద్రౌపది ముర్ము యుద్ధనౌకల సమీక్ష చేయనున్నారు. దీనినే ప్రెసిడెన్షియల్ ఫ్లీట్ రివ్యూ (పిఎఫ్ఆర్) అని కూడా పిలుస్తారు. ఇతర దేశాల నౌకలు ఉండడంతో ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ (ఐఎఫ్ఆర్)గా దీన్ని అభివర్ణిస్తారు. మొత్తం 71 యుద్ధనౌకల్లో భారత నౌకాదళానికి చెందినవి 45 ఉన్నాయి. 7 కోస్ట్ గార్డ్ యుద్ధనౌకలు దీంట్లో ఉన్నాయి. ఈ మొత్తం నౌకలను ఆరు వరుసల్లో సముద్రంలో ఉంచనున్నారు. 50 యుద్ధ విమానాలు సముద్రం, ఆకాశంలో సందడి చేయనున్నాయి. ఐఎన్ఎస్ విక్రాంత్ యుద్ధనౌక ఈ విన్యాసాల్లో పాల్గొంటుంది. ఒకపక్క సముద్రంపైనా, మరోపక్క ఆర్‌కె బీచ్‌లోనూ ఈ సందడి కనిపించనుంది. అందుకోసం నావికాదళం భారీ ఏర్పాట్లను సాగరతీరంలో ఏర్పాటు చేయనుంది.

**19న ఆర్‌కె బీచ్‌లో పరేడ్**

ఈ నెల 19న సాయంత్రం బీచ్ పరేడ్ (కవాతు)ను భారత నౌకాదళం నిర్వహించనుంది. ఐఎఫ్ఆర్‌కు విచ్చేసిన 55 దేశాలకు చెందిన నావికాదళ ప్రతినిధులూ దీంట్లో పాల్గొననున్నారు. భారత నౌకాదళ అధికారి దినేష్ కుమార్ త్రిపాఠి, తూర్పునౌకాదళం చీఫ్ సంజరు భళ్లా, ఇతర నావికాదళాధికారులు, వారి కుటుంబ సభ్యులు ఆర్‌కె బీచ్‌లో ఆశీనులై అంతర్జాతీయ నావికాదళ కార్యకలాపాలను తిలకించనున్నారు.

ఆయా దేశాల నుంచి విచ్చేసిన నావికాదళాలు తమ బ్యాండ్ మేళాలు, వారి వారి సంప్రదాయ నృత్యాలు, సాంస్కృతిక కార్యకలాపాలతో సాగరతీరంలో వీక్షకులకు కనువిందు చేయనున్నాయి.

# సంపాదకీయం

## ఏఐతో భవిష్యత్తు..




నలభై ఆరేళ్ల క్రితం అంటే 1980లో దేశంలో కంప్యూటరీకరణను విస్తరింప చేయాలని ప్రభుత్వం నిర్ణయించగా ఆందోళనలు తలెత్తాయి. 1984 సంవత్సరాన్ని 'యాంటీ కంప్యూటరైజేషన్ సంవత్సరం'గా పరిగణించారు. దీంతో తమ ఉద్యోగాలు పోతాయని, ఆర్థికంగా దెబ్బతింటాయని, దేశంలో తీవ్ర పరిస్థితులు తలెత్తుతాయని కార్మికులు నిరసన ప్రదర్శనలు సాగించారు. అయితే రానురాను డిజిటల్ టెక్నాలజీని అమలు లోకి విస్తారంగా తీసుకు రావడంతో సమాజంలోని అన్ని వర్గాల్లో, దేశం మొత్తం మీద ఆలోచనల్లో మార్పు రావడం ప్రారంభమైంది. కంప్యూటర్లు, ఆధునిక సాంకేతికత భారీగా ఉద్యోగాలు కల్పిస్తాయని, జీవితంలో అనేక విధాలుగా ఉపయోగపడతాయని నమ్మకం పెరిగింది. ఎఐ (కృత్రిమ మేధ) ఆధునిక ప్రపంచంలో కీలకమైన కేంద్రంగా వర్ధిల్లుతోంది. ఇప్పుడు ఎక్కడ విన్నా ఎఐ గురించే చర్చ వినిపిస్తోంది. మానవ చరిత్రలో ఇప్పటివరకు ఎన్నో పెద్దమార్పులు వచ్చాయి. కానీ ఇప్పుడు ఎఐ అన్నది అత్యంత శక్తివంతమైన, అతి గొప్ప ఆవిష్కరణల్లో ఒకటిగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రపంచ సాంకేతిక నాయకత్వంలో భారత్ అగ్రస్థానం సాధించాలన్న లక్షంతో ఢిల్లీలోని భారత్ మండపంలో 'ఎఐ ఇంపాక్ట్ సమ్మిట్' ప్రారంభం కావడం చెప్పుకోదగిన ఘట్టం. ఎఐ యుగం నియమాలు, ప్రమాణాలు, అవకాశాలను రూపొందించడంలో మనదేశం కీలకంగా ఉండాలనే ప్రధాన లక్షంతో ఏర్పాటైన ఈ సదస్సు గురించి ప్రధాని మోడీ ఆశాభావం వ్యక్తం చేశారు. డిజిటల్ సదుపాయాల కల్పన, శక్తివంతమైన స్టార్టప్‌ల ఏర్పాటు, అత్యాధునిక పరిశోధనలు వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాల్లో భారత్ బాధ్యత మరింత పెరగనుందని వెల్లడించడం గమనార్హం. ఇప్పటికే దేశంలో ఆరోగ్య సంరక్షణ, విద్య, వ్యవసాయం, పరిపాలన, వంటి అనేక రంగాల్లో ఎఐ కీలక పాత్ర పోషిస్తోంది. ఇప్పుడు 22 రంగాల్లోని 17 రంగాల కంపెనీలు తమను తాము ఎఐ సాంతికత దిశగా మార్చుకోవలసిన ఒత్తిడి ఎక్కువగా ఉంది. ఎఐతో ఎక్కువ అనుబంధం ఉన్న ఐటి వంటి రంగాల్లో పెద్ద మార్పులు వస్తున్నాయి. మైక్రోసాఫ్ట్ ఎఐ సిఇఒ ముస్తఫా సులేమాన్ వచ్చే 18 నెలల్లో కంప్యూటర్ ఉద్యోగాలన్నీ ఎఐతో భర్తీ అవుతాయని అంచనా వేశారు. ఎఐ వల్ల 2035 నాటికి ప్రపంచ జిడిపి (స్థూల దేశీయోత్పత్తి) లో 15 శాతం పాయింట్లు పెరగవచ్చని ఏడాది క్రితం ప్రైస్ వాటర్ హౌస్ కూపర్స్ అనే సంస్థ అంచనా వేసింది. అంటే ప్రతి సంవత్సరం సుమారు 1 శాతం అదనపు అభివృద్ధి తథ్యమన్న అంచనాలు వెలువడ్డాయి. ఈ సదస్సు ఒక బలీయమైన జాతీయ ఎఐ పర్యావరణ వ్యవస్థను నిర్మించడానికి మాత్రమే ప్రయత్నించకుండా ప్రపంచ దక్షిణార్ధ దేశాలను కూడా ఇందులో భాగస్వాములను చేయాలన్న తపన కనిపిస్తోంది. ఆయా దేశాలు కృత్రిమ మేధపై తమ ప్రణాళికలను ఈ వేదికపై వెల్లడించే అవకాశం కనిపిస్తోంది. అయితే ఎఐ ప్రణాళికలకు సంబంధించి భారత్ ముందు అనేక సవాళ్లు ఉన్నాయి. ఈ సాంకేతికతకు కావలసిన కనీస సెమీ కండక్టర్లు లేదా కంప్యూటర్ చిప్‌లు తయారు చేసే సామర్థం ఇంకా భారత్‌కు అలవడ లేదు. ప్రస్తుతం దేశంలో ఎఐ సంపూర్ణ సామర్థంతో ఏ కంపెనీ లేదు. అలాగే మెగా డేటా సెంటర్లు లేవు. పాత్రధారులు, నాటకం స్క్రిప్టు, కనీసం వేదిక లేకుండా ఏదైనా నాటకం ఎలా ప్రదర్శించలేరో అలాగే క్షేత్రస్థాయిలో కనీస మౌలిక అవసరాలులేకుండా ఎఐ సాంకేతికతను సాధించడం కష్టతరమే. అయినప్పటికీ ఎఐకి అనుకూలమైన పర్యావరణ వ్యవస్థ గత కొన్నేళ్లుగా ఏర్పడి చిగుళ్లు మొలకెత్తడం ప్రారంభమైంది. రెండేళ్లుగా సెమీకండక్టర్ల తయారీ అత్యంత నాటకీయంగా ఆవిర్భావమైంది. ఈ ఏడాది జనవరి నాటికి దేశం లోని ఆరు రాష్ట్రాల్లో 10 సెమీ కండక్టర్ తయారీ ప్రాజెక్టులు వచ్చాయని, వీటిలో కొన్ని ఆన్‌లైన్‌లో ఉన్నాయని ప్రభుత్వం అంచనాగా చెబుతోంది. ఇక రెండో అంశం.. దేశంలో మెగా డేటా సెంటర్ల ఏర్పాటును ప్రోత్సహించడం గత ఏడాది గూగుల్, అమెజాన్, మైక్రోసాఫ్ట్, డిజిటల్ కనెక్షన్, తదితర ప్రపంచ స్థాయి సాంకేతిక సంస్థలు 2030 వరకు ఎఐ, క్లౌడ్ మౌలిక సదుపాయాల్లో దాదాపు 68 బిలియన్ డాలర్ల వరకు పెట్టుబడులు పెట్టడానికి నిర్ణయం తీసుకున్నాయి. ఈ మేరకు చిప్ డిజైన్, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ పర్యావరణం నెలకొల్పేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయనే చెప్పవచ్చు. ఈ సమయంలో ప్రభుత్వం నుంచి సరైన ప్రోత్సాహం లభిస్తేనే ఊపందుకుంటుంది. ఆయా ప్రపంచ స్థాయి సాంకేతిక సంస్థల అధినేతలు భారతదేశ సామర్థం గురించి ఆశావహులుగా ఉన్నారు. జెన్‌సెన్ హుయాంగ్, గూగుల్ సిఇఒ సుందర్‌పిచాయ్, తదితరులు భావితరానికి ఎఐ సాంకేతిక కేంద్రంగా భారత్ వర్ధిల్లుతుందని, ఎఐని భారత్ ముందుకు తీసుకెళ్తుందని అభిప్రాయాలతో దృఢమైన విశ్వాసం వెలిబుచ్చడం గమనార్హం. భారత్‌లో మానవ వనరులకు లోటు లేదని, ఎఐ అమలు స్థాయి మరింత ముందుకు వెళ్తుందని చెబుతున్నారు. ఇప్పటికే ఎఐ ఫ్రంట్రన్నర్ చాట్ జిపిటిలో ప్రపంచం మొత్తం మీద రెండో భారీ మార్కెట్‌గా భారత్ ఉంటోందని ఆ సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ సామ్ అల్ట్‌మాన్ అంగీకరించారు. ఎఐ నమ్మదగిన ముఖ్యమైన మార్కెట్‌గా అభివర్ణించారు. ఇవన్నీ ఎఐ సంస్థలకు భారత్ ఆకర్షణీయ కేంద్రంగా మారుస్తున్నాయి. ఏఐ వల్ల పలు ఉద్యోగాలకు పోతాయని ప్రపంచ వ్యాప్తంగా ఎంతోమంది ఆందోళన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో ప్రముఖ బిలియనీర్, పారిశ్రామిక వేత్త వినోద్ ఖోస్లా సంచలన వ్యాఖ్యలు చేశారు. ఏఐ టూల్స్ రాబోయే ఐదేళ్లలో ఐటీ సేవలు, బీపీఓ ఉద్యోగాలు దాదాపు కనమరుగవుతాయని అంచనా వేశారు. రానున్న 15 ఏళ్లలో నైపుణ్య ఆధారిత వృత్తులు తుడిచిపెట్టుకుపోతాయని హెచ్చరించారు. అయితే విద్య, వైద్య సంరక్షణ అందరికీ అందుబాటులో వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026 నేపథ్యంలో హిందుస్థాన్ టైమ్స్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో వినోద్ ఖోస్లా మాట్లాడారు. బిపిఓ లేదా బిజినెస్ ప్రాసెస్ అవుట్‌సోర్సింగ్ అనేది కంపెనీలు థర్డ్-పార్టీ సర్వీస్ ప్రొవైడర్లకు అవుట్‌సోర్స్ చేసే లార్జ్ సెగ్మెంట్ వర్క్‌ను సూచిస్తుంది. ఏఐ వల్ల ఇది తీవ్రంగా ప్రభావితమవుతుందని తెలిపారు. ఇండియాలోనే ఐటీ సర్వీసెస్‌పై కూడా ఇదే తరహా ప్రభావ ఉంటుందని అంచనా వేశారు. ఏఐ సిస్టమ్స్ ఆర్థికంగా విలువైన పనులలో మానవులను అధిగమించగల స్థితికి వేగంగా చేరుకుంటున్నాయని ఆయన తెలిపారు. ఏఐ అనేది డిజిటల్ అసిస్టెంట్స్ నుండి అటానమస్ ఏఐ వర్కర్క్ దిశగా మారుతుందని, అకౌంటింగ్, లా, మెడిసిన్, చిప్ డిజైన్ వంటి రంగాలు మరో దశాబ్దకాలంలో ఏఐ వల్ల ప్రభావితం కావచ్చని తెలిపారు. ఈ తరుణంలో ఎఐ ఇంపాక్ట్ సమ్మిట్ ఢిల్లీలో ప్రారంభం కావడం శుభోదయమే. ఇది విజయవంతమైతే ఈ శిఖరాగ్ర సమావేశం భారతీయ సంకల్పానికి కేవలం ఒక వేడుకలా మాత్రమే కాకుండా, ప్రపంచానికే కీలకమైన మలుపుగా మారుతుందన్న ఆశ కలుగుతోంది.

# రాజకీయమా నీదే పార్టీ.?

**హైదరాబాద్ - సూర్య వాస్తవం**

తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ఫలితాలు రాష్ట్ర రాజకీయాల్లో అత్యంత విచిత్రమైన, ఆసక్తికరమైన సమీకరణాలకు తెరలేపాయి. సిద్ధాంతపరంగా బద్ధశత్రువులుగా కనిపించే పార్టీలు క్షేత్రస్థాయిలో అధికారం కోసం చేతులు కలపడం 'అవకాశవాద రాజకీయం'గా కనిపిస్తున్నా, దీని వెనుక లోతైన వ్యూహాలు దాగి ఉన్నాయి. మున్సిపల్ ఎన్నికల్లో పార్టీల కంటే స్థానిక గెలుపు గుర్రాలే కీలకం కావడంతో చాలా చోట్ల అనూహ్య పొత్తులు కనిపించాయి. బీజేపీ-కాంగ్రెస్, బీఆరఎస్-బీజేపీ వంటి అసంభవమైన కలయికలు కొన్ని మున్సిపాలిటీల్లో అధికార పీఠాలను కైవసం చేసుకున్నాయి. నిజామాబాద్ వంటి చోట్ల కాంగ్రెస్-మజ్లిస్ జతకట్టడం గమనార్హం. రాష్ట్ర స్థాయిలో నాయకులు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటున్నా, స్థానిక కౌన్సిలర్లు మాత్రం తమ ఉనికిని కాపాడుకోవడానికి పార్టీల మధ్య ఉన్న గీతలను చెరిపివేశారు. బీఆరఎస్ నేత హరీష్ రావు వంటి వారు ఇతర పార్టీల అనైతిక పొత్తులపై విమర్శలు గుప్పిస్తున్నప్పటికీ, స్థానిక సమీకరణాలు ఎప్పుడూ భిన్నంగానే ఉంటాయి. గ్రావిణ , పట్టణ స్థానిక సంస్థల్లో నాయకత్వం వ్యక్తిగత ప్రాబల్యంపై ఆధారపడి ఉంటుంది. అసెంబ్లీ లేదా పార్లమెంట్ ఎన్నికల నాటికి ఈ సవికరణాలు మారిపోయి, మళ్ళీ ఆయా పార్టీల అధిష్టానాల ఆదేశాల మేరకు రాజకీయాలు నడుస్తాయి. అయితే ఈ మున్సిపల్ ఎన్నికలు పార్టీల మధ్య ఉన్న రాజకీయ అంటరానితనం పోయిందని స్పష్టం చేశాయి. ఈ ఎన్నికల తర్వాత అత్యంత ఆసక్తికరమైన చర్చ బీజేపీ - బీఆరఎస్ పొత్తు గురించి మొదలైంది. కాంగ్రెస్ పార్టీని ఎదుర్కోవాలంటే ఈ రెండు పార్టీలు కలవడం ద్వారా ఓటు బ్యాంక్ ఏకీకరణ జరుగుతుందని ఒక వర్గం అభిప్రాయపడుతోంది. ముఖ్యంగా గత అసెంబ్లీ ఎన్నికల్లో ఈ రెండు పార్టీల ఓట్ షేర్ కలిపితే అది అధికార పార్టీ కంటే ఎక్కువగా ఉండటమే ఈ చర్చకు ప్రధాన కారణం. కాంగ్రెస్‌ను బలహీనపరచడానికి ఈ రహస్య లేదా బహిరంగ పొత్తు మున్సిపల్ స్థాయి నుండి రాష్ట్ర స్థాయికి వెళ్లే అవకాశం ఉందా అన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న. బీజేపీకి పట్టణ ప్రాంతాల్లో, బీఆరఎస్‌కు గ్రావిణ ప్రాంతాల్లో ఉన్న పట్టును కలిపితే బలమైన శక్తిగా ఎదగవచ్చని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను ఒంటరిగా ఎదుర్కోవడం కంటే, ఉమ్మడి శత్రువును ఓడించడానికి రెండు పార్టీలు చేతులు కలపడం వ్యూహాత్మకంగా లాభిస్తుంది. అయితే, ఈ పొత్తు వల్ల ఇరు పార్టీల సిద్ధాంతాలకు తూట్లు పొడిచినట్లవుతుందనే భయం కూడా నాయకత్వాల్లో ఉంది. మైనారిటీ ఓట్లు కోల్పోతామనే భయం బీఆరఎస్‌కు ఉంటే, హిందుత్వ ఓటు బ్యాంకులో చీలిక వస్తుందేమోనన్న ఆందోళన బీజేపీలో ఉంది. రాబోయే రోజుల్లో ఈ రెండు పార్టీలు పొత్తుల గురించి ఆలోచన చేసే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఎందుకంటే, తెలంగాణలో కాంగ్రెస్‌ను ఒంటరిగా ఢీకొట్టడం ప్రస్తుత పరిస్థితుల్లో కష్టతరమని ఈ మున్సిపల్ ఫలితాలు నిరూపించాయి. రాష్ట్ర స్థాయి రాజకీయం ఎప్పుడూ అధికారం చుట్టూనే తిరుగుతుంది కాబట్టి, భవిష్యత్తులో బీజేపీ-బీఆరఎస్ కలిసి పనిచేయడం అనేది అసాధ్యమేవి కాదు. అయితే అది బహిరంగ పొత్తుగా ఉంటుందా లేదా లోపాయికారి ఒప్పందంగా ఉంటుందా అనేది కాలమే నిర్ణయించాలి.



# రోజుకో ఏడుగురు ఎమ్మెల్యేలతో భేటీ

**విజయవాడ - సూర్య వాస్తవం**

పవర్‌లోకి వచ్చి ఆల్రెడీ ఇరవై నెలలు అవుతుంది. ఇప్పటిదాకా అభివృద్ధి, సంక్షేమంపైనే ఫుల్ ఫోకస్ నడిచింది. త్వరలోనే స్థానిక ఎన్నికలు, మున్సిపల్ ఎలక్షన్స్ రాబోతున్నాయ్. ఇప్పుడు పార్టీపై కాన్సన్‌ట్రేషన్ షిఫ్ట్ చేశారు సీఎం చంద్రబాబు నియోజకవర్గంలో సమస్యలు ఏంటి.?ప్రజల్లో ప్రభుత్వంపై ఎలాంటి ఒపీనియన్ ఉంది.? స్థానికంగా ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీలు అమలు చేశారా.? మీకేం కావాలి.? పార్టీ పరంగా ఏం చేయాలి.? ప్రభుత్వ పరంగా చేసి పెట్టాల్సిన పనులు ఏంటి.? మీ వ్యక్తిగత సమస్యలు ఏమైనా ఉన్నాయా.? అంటూ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో ముఖాముఖి నిర్వహిస్తున్నారు. సమస్యలు చెప్పుకునేందుకు.. తప్పులు సరిదిద్దుకునేందుకు అవకాశం ఇవ్వలేదనే విమర్శలు రాకుండా ముందు జాగ్రత్తలు తీసుకునే పనిలో పడ్డారట. అసలే అసెంబ్లీ బడ్జెట్ సెషన్ నడుస్తుంది.ఎమ్మెల్యేలంతా 9 గంటల వరకు సభలో ఉండాలని ఇప్పటికే బాబు ఆదేశించారు. ఈ క్రమంలో ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలంతా బడ్జెట్ సమావేశాలు అయిపోయే వరకు విజయవాడలోనే ఉండే అవకాశం ఉంది. దీంతో ఇదే సమయంలో పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో వరుసగా భేటీ అవుతూ..ఎక్కడికక్కడ సమస్యలకు చెక్ పెట్టి.. అంతా సెట్ చేసే ప్లాన్ చేస్తున్నారట.అటు మంత్రి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ కూడా సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ప్రతిరోజూ ఏడుగురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో డిన్నర్ మీట్ అవుతున్నారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు పూర్తయ్యే వరకూ ఈ భేటీలు జరగనున్నాయి. రోజూ ఒక్కో జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, వారి కుటుంబసభ్యులతో నారా లోకేశ్ డిన్నర్ భేటీలు కంటిన్యూ కాబోతున్నాయి. నారా లోకేష్‌తో జరిగే ఈ డిన్నర్ మీట్‌లో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటుగా వారి కుటుంబసభ్యులు కూడా హాజరవుతున్నారు. ఈ విందు సమావేశాల్లో నియోజకవర్గాల్లోని సమస్యలపై చర్చించడంతో పాటు.. ఎమ్మెల్యేలతో నేరుగా మాట్లాడే అవకాశం లభిస్తుందని నారా లోకేశ్ భావిస్తున్నారు.

ఇలా అటు సీఎం చంద్రబాబు ప్రజాప్రతినిధులకు డైరెక్షన్స్ ఇస్తూ..ఫ్యూచర్ పాలిటిక్స్‌పై దిశానిర్దేశం చేస్తున్నారట. లోకేశ్ అయితే ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను బాండింగ్ పెంచుకునేలా.. కమ్యూనికేషన్ గ్యాప్ రాకుండా చేస్తుంటే..ఎక్కడా అసంతృప్తులు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారట. గత ప్రభుత్వ హయాంలో సీఎం అపాయింట్మెంట్ దొరకడం లేదంటూ అధికార పార్టీ ఎమ్మెల్యేలు కూడా గగ్గోలు పెట్టినట్లు కథనాలొచ్చాయి. పైగా తమ హయాంలో సీఎంవో నడపాల్సినంత గొప్పగా నడపలేకపోయామని వైసీపీ నేతలే చెప్తుంటారు. కడుపు చించుకుంటే కాళ్ల మీద పడుతుందనే ఆవేదనతో కొంతమంది ఎమ్మెల్యేలు కక్కలేక, మింగలేక మిన్నకుండి పోయి ఎన్నికల తర్వాత బరస్ట్ అయిపోయారు. మరికొందరు అయితే ముందు నుంచే ఆఫ్ ది రికార్డ్‌లో తమ ఆగ్రహాన్ని, ఫ్రస్ట్రేషన్‌ను వెళ్లగక్కిన సందర్భాలు న్నాయి. అయితే తమ పార్టీలో, ప్రభుత్వంలో పరిస్థితికి తావు లేకుండా అటు సీఎం చంద్రబాబు, ఇటు మంత్రి లోకేశ్ సరికొత్త ఆలోచన చేశారని తెలుస్తోంది. తమ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో అయినా పూర్తిగా కొన్ని గంటలు వ్యక్తిగతంగా, మరికొంత సమయం వారి కుటుంబ సభ్యులతోనూ కలిసినట్లు ఉండటంతో పాటు.. వారి నియోజకవర్గాల్లో సమస్యలు, పార్టీ పరిస్థితి, ప్రజల అభిప్రాయాలను లోతుగా తెలుసుకునే అవకాశం ఉంటుందని భావిస్తున్నారట. ఈ అసెంబ్లీ సెషన్ పూర్తయ్యేలోపు డిన్నర్ విత్ లోకేశ్ కార్యక్రమం వైరల్‌గా మారే ఛాన్స్ ఉంది. అలా అని లోకేశ్ ప్రత్యేకత ఈ ఒక్క కార్యక్రమానికే పరిమితం కాదని..మంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి "ఎక్స్" వేదికగా తన దృష్టికి తీసుకొచ్చిన సమస్యలపైనా వెంటనే స్పందిస్తున్నారని గుర్తు చేస్తున్నారు.ఎక్స్‌లో తన దృష్టికి వచ్చిన సమస్యను..తన ఆఫీస్ టీమ్‌కు అసైన్ చేస్తున్నారు.. వారు ఫాలో అప్ చేసి, స్థానిక అధికారులతో సమన్వయం చేసుకుని, సమస్యను సాల్వ్ చేసే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పుడు డిన్నర్ మీట్‌తో నేరుగా సమావేశం అయి..గ్రూప్‌వార్..కమ్యూనికేషన్ గ్యాప్‌కు చెక్ పెట్టి..అక్కడక్కడ ఏమైనా అసంతృప్తులు, అలకలు ఉన్నా అంతా సెట్‌రైట్ చేసేందుకు ప్రత్యేక ప్రణాళికను అమలు చేస్తున్నట్లు తెలుగు తమ్ముళ్లు చర్చించుకుంటున్నారు



# 3 రకాల సభ్యత్వాలతో జనసేన

**విజయవాడ - సూర్య వాస్తవం**

జనసేన పార్టీ తన సంస్థాగత నిర్మాణాన్ని మరింత బలోపేతం చేసే దిశగా అడుగులు వేస్తోంది. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, కార్యకర్తల భాగస్వామ్యాన్ని క్రమబద్ధీకరించేందుకు సరికొత్త సభ్యత్వ విధానాన్ని ప్రవేశపెట్టింది. ఈ క్రమంలో పార్టీలో మూడు రకాల సభ్యత్వ వర్గాలను నిర్ణయించింది. జనసేన పార్టీ తన శ్రేణులను మూడు విభాగాలుగా విభజించింది. మొదటి వారిని ఉద్యమి గా పిలుస్తారు. వీరు పార్టీపై నమ్మకం, అభిమానంతో ప్రాథమిక సభ్యత్వం తీసుకున్న వారు. రెండవ కేటగిరీకి చెందిన వారిని సాధక్ అని పిలుస్తారు. వీరు కేవలం సభ్యులుగానే కాకుండా, పార్టీ సభ్యత్వ నమోదును వేగవంతం చేస్తూ, పార్టీ ఆశయాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లే క్రియాశీలక పాత్ర పోషిస్తారు. ఇక మూడవ కేటగిరీలోకి ప్రధాతలు వస్తారు. వీరు పార్టీకి వివిధ రూపాల్లో ఆర్థికంగా లేదా మేధో పరంగా అండగా నిలుస్తూ, నాయకత్వ బాధ్యతలు చేపట్టి పార్టీ బలోపేతానికి కృషి చేస్తారు.సభ్యత్వ నమోదు ప్రక్రియను పారదర్శకంగా మరియు సులభంగా నిర్వహించేందుకు జనసేన పార్టీ డిజిటల్ పద్ధతులను అవలంబిస్తోంది. ప్రతి సభ్యుని వివరాలను ఆన్‌లైన్ డేటాబేస్‌లో నిక్షిప్తం చేయడం ద్వారా, భవిష్యత్తులో వారికి ఇన్సూరెన్స్ వంటి ప్రయోజనాలను అందించాలని పార్టీ భావిస్తోంది. ముఖ్యంగా యువతను ఈ ఉద్యమి-సాధక్-ప్రధాత ' విధానం వైపు ఆకర్షించడం ద్వారా పార్టీలో జవాబుదారీతనం పెరుగుతుందని నాయకత్వం ఆశిస్తోంది.ఏపీలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని, ప్రతి గ్రామం, వార్డులో జనసేన జెండాను రెపరెపలాడించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం సాగుతోంది. సాధారణ సభ్యుల నుండి నాయకుల వరకు వారి పనితీరు , అంకితభావాన్ని బట్టి ఈ వర్గీకరణలో గుర్తింపు లభిస్తుంది. ఈ నూతన విధానం ద్వారా పార్టీ కేడర్‌లో కొత్త ఉత్సాహం నింపడంతో పాటు, క్రమశిక్షణతో కూడిన రాజకీయ వ్యవస్థను నిర్మించాలని పవన్ కళ్యాణ్ భావిస్తున్నారు.



# సింగనమల ఆస్పత్రిని తనిఖీ చేసిన కలెక్టర్ ఆనంద్





**అనంతపురం వైద్యం - సూర్య వాస్తవం :** సింగనమల ఆస్పత్రిని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న సేవలు, వైద్యుల సమయపాలన గురించి జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. వైద్యులు 24 గంటలు అందుబాటులో ఉన్నారని, సేవలు బాగా అందుతున్నాయని రోగులు తెలిపారు. వార్డుతో పాటు ఆసుపత్రిలోని అన్ని యూనిట్లను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ఆసుపత్రి చాలా చక్కగా మరియు బాగా నిర్వహించబడుతుందని మరియు సిహెచ్సి వైద్యుల సేవల పట్ల జిల్లా కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఓపి నుండి డిశ్చార్జ్ అయ్యేంతవరకు రోగుల సేవల కోసం నెక్స్ట్ జెన్ హాస్పిటల్ పోర్టల్ గురించి మెడికల్ ఆఫీసర్ డా.కే.రోహినాథ్ ని అడిగి తెలుసుకున్నారు. ఈ నెక్స్ట్ జెన్ యాప్ ద్వారా పేషెంట్ పూర్తి సమాచారం గురించి తెలుసుకోవడం భవిష్యత్తులో సులభంగా మారుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. సిహెచ్సి ద్వారా మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శేషారెడ్డి, ఎంపీడీవో, ఆసుపత్రి సిబ్బంది, రోగులు పాల్గొన్నారు.

# సేవా కార్యక్రమాలు చేయడం ఓ వరంగా భావిస్తున్నాను..

**- సిమ్స్ హాస్పిటల్ ఎండి బాదల్ నిసార్ యాసిన్ ఖాన్**
**- ఇమామ్ మౌజన్ల భవిష్యత్తు సంక్షేమానికి 2 లక్షలతో సంక్షేమ నిధి ఏర్పాటు**



**శ్రీ సత్యసాయి బ్యూరో - సూర్య వాస్తవం:** ప్రజలకు సేవ చేయడానికి తాను దేవుడిచ్చిన వరంగా భావిస్తున్నాను అని కదిరిలోని రైల్వే స్టేషన్ రోడ్డులోఉన్న సిమ్స్ హాస్పిటల్ ఎండి బాదల్ నిసార్ యాసీన్ ఖాన్ పేర్కొన్నారు. పవిత్రమైన రంజాన్ నెల ప్రారంభాన్ని పురస్కరించుకొని కదిరి ప్రాంతంలోని పరిసర మండలాలలోని 250 మంది ఇమామ్ మరియు మౌజన్ లకు మంగళవారం ఆస్పత్రి ఆవరణంలో ఒక బియ్యం బస్తా, 5 కిలోల పిండి ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యాసిన్ ఖాన్ మాట్లాడుతూ ఈ నెల నుండి ప్రతినెల ఇమామ్, మౌజన్ల కుటుంబాలలో జరిగే వివాహాలకు రూ.20,000 నగదు, 2 బస్తాల బియ్యాన్ని అందిస్తానని పేర్కొన్నారు. అదే విధంగా ఇమామ్, మౌజన్‌ల సంక్షేమం కోసం రెండు లక్షల రూపాయలతో తక్షణమే ఒక సంక్షేమ నిధిని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఇమామ్‌లు ఇంత గొప్ప దాతృత్వ గుణాలను కలిగి ఉన్న బాదల్ నిసార్ యాసీన్ ఖాన్ రాబోయే కాలంలో మరింత నిస్వార్థ సేవా కార్యక్రమాలు చేస్తూ అందరి యొక్క ఆశీస్సులు పొందాలని మన స్ఫూర్తిగా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ప్రధానోపాధ్యాయులు బి.మైనుద్దీన్, హఫీజ్ ముబారక్, వసీం యాసీన్ ఖాన్, దాదాపు 250 మంది ఇమామ్, మౌజన్లు, సిమ్స్ హాస్పిటల్ సిబ్బంది షాదాబ్, అశ్వాక్ పాల్గొన్నారు.

# ఫార్మర్ ఐడి నమోదుకు 21 వరకు గడువు

**- మండల వ్యవసాయ అధికారి జీపీ ఓబులేసు**



**వేముల - సూర్య వాస్తవం:** వేముల మండల పరిధిలోని 1892 మంది రైతుల ఫార్మర్ ఐడీలేని లిస్టును కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఈ లిస్టు అన్ని రైతు సేవా కేంద్రాలలో అందుబాటులో ఉన్నది. రైతులకు ఫోన్ ద్వారా మెసేజ్ రూపంలో కూడా ఈ సందేశాన్ని పంపించబడింది. ఈ ఐడి లేని రైతులు రాబోయే రోజుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా అందించబడే వ్యవసాయ పథకలు వర్తించవని తెలియజేశారు. ఈ ఫార్మర్ ఐడితోనే అనుసంధానమై ఉంటుందని తెలిపారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వం నుంచి సబ్సిడీపై అందించే వ్యవసాయ పరికరాములు, యూరియా మొదలగునవి అందించబడవని తెలిపారు. కావున రైతులందరూ తప్పనిసరిగా మీ ఆధార్ కార్డు, బ్యాంకు పాసుబుక్, రేషన్ కార్డ్, మొబైల్ నెంబర్ తీసుకుని మీ దగ్గరలోని రైతు సేవా కేంద్రంలో నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి జిపి ఓబులేసు తెలియజేశారు. ఈ నెల 21వ తేదీ లోపు రిజిస్ట్రేషన్ నమోదు చేయించుకోగలరని తెలియజేశారు. రైతులు మీ సమ యాన్ని తీసుకొని నమోదు చేయించుకోగలరు. నమోదు చేయించుకోని వారికి ఎటు వంటి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సబ్సిడీ పథకాలు అందవు అని పేర్కొ న్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ సురేష్, విహెచ్ఎ నియజ్ వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

# బుడ్డశనిగ కొనుగోలు కేంద్రాలు వెంటనే ఏర్పాటు చేయాలి

- యూరియా కొరత లేకుండా చూడాలి
- పెంచిన రసాయనిక ఎరువుల ధరలు తగ్గించాలి
- డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి



**వేంపల్లె - సూర్య వాస్తవం :**

బుడ్డ శనిగ కొనుగోలు కేంద్రాలు వెంటనే ఏర్పాటు చేయాలని, యూరియా కొరత లేకుండా చూడాలని, పెంచిన రసాయనిక ఎరువుల ధరలు వెంటనే తగ్గించాలని రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం కడప జిల్లా, పులివెందుల నియోజకవర్గం, వేంపల్లి మండలం చింతల మడుగు పల్లి గ్రామంలో నాగులయ్య, ఈశ్వరమ్మ రైతు దంపతుల బుడ్డ శనిగ పంట పొలాన్ని కాంగ్రెస్ నాయకులతో కలిసి తులసి రెడ్డి సందర్శించారు.

ఈ సందర్భంగా నాగులయ్య,ఈశ్వరమ్మ దంపతులు తమ గోడును తులసి రెడ్డి వద్ద వెల్లబోసుకున్నారు. తులసి రెడ్డి మాట్లాడుతూ రాయలసీమ, ప్రకాశం జిల్లాలలో రబీ సీజన్లో బుడ్డ శనిగ ప్రధానమైన పంటని, దాదాపు 12 లక్షల ఎకరాలలో ఈ పంట వేస్తారని అన్నారు. ఈ సంవత్సరం బుడ్డ శనిగ దిగుబడి బాగా వచ్చినప్పటికీ ధర లేని కారణంగా రైతులు లబోదిబో అంటున్నారని తులసి రెడ్డి ఆవేదన వెలిబుచ్చారు. కేంద్ర ప్రభుత్వం క్వింటాలు బుడ్డ సెనగకు రు 5875 గా కనీస మద్దతు ధరను ప్రకటించింది.కానీ మార్కెట్లో ఆ ధర లభించడం లేదు.వ్యాపారస్తులు క్వింటాలు బుడ్డ సెనగను రు 4800 కు మాత్రమే రైతుల వద్ద కొంటున్నారు. దీనికి తోడు క్వింటాలుకు ఐదు కేజీలు తరుగు తీస్తున్నారు. దీని వలన క్వింటాలు మీద రైతులు రూ.1000 వరకు నష్టపోతున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వము బుడ్డ శనిగ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఇప్పటికే 50 శాతం పంటను రైతులు అయిన కాడికి అమ్ముకున్నారు.ఇప్పుడైనా ఏ మాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని తులసి రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చం నాయుని తో ఫోన్లో మాట్లాడారు.

**యూరియా కొరత**

ప్రస్తుతం వరి, జొన్న, మొక్కజొన్న,అరటి,నువ్వు తదితర పంటలకు యూరియా అవసరం ఎంతైనా ఉంది.కానీ రాష్ట్ర వ్యాప్తంగా యూరియా కొరత తీవ్రంగా ఉంది.యూరియా బస్తా ధర 266 రూపాయలు కాగా బ్లాక్ మార్కెట్లో బస్తా యూరియా మీద రూ.300 నుంచి రూ.600 వరకు ఎక్కువ చెల్లించి కొనాల్సి వస్తోంది.

**పెరిగిన రసాయనకి ఎరువులు ధరలు**

ఒకవైపు వ్యవసాయం గిట్టుబాటు కాక రైతులు లబోదిబోమంటుంటే కేంద్ర ప్రభుత్వం రసాయనఎరువుల ధరలు విపరీతంగా పెంచడం శోచనీయం. ఆరు నెలల్లోనే రెండుసార్లు ప్రభుత్వం ధరలు పెంచింది. మ్యూరెట్ ఆఫ్ పొటాషియం ధర ఆరు నెలల కిందట 50 కేజీల బస్తా రూ.1400 ఉండగా ప్రస్తుతం రూ.1850 అయింది. 14-35-14 ధర 50 కేజీల బస్తాకు ఆరు నెలకిందట రూ. 1450 ఉండగా ప్రస్తుతం రూ.2150లు అయింది.

**కాంగ్రెస్ డిపాండ్లు**

1. వెంటనే రాష్ట్రవ్యాప్తంగా బుడ్డ శనిగ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి.
2. యూరియా కొరత లేకుండా చూడాలి.
3. పెంచిన రసాయనిక ఎరువుల ధరలు తగ్గించాలి.

# నార్కోటిక్స్, గంజాయి నిల్వ కేంద్రం కోసం స్థల పరిశీలన



**అనంతపురం - సూర్య వాస్తవం:** అనంతపురం నగరం లోని జిల్లా పోలీసు కార్యాలయం ప్రాంగణంలోని ఎఆర్ ప్రధాన కార్యాలయం (స్వాధీనం చేసుకున్న గంజాయి నిల్వ స్థానం) వద్ద మంగళవారం నార్కోటిక్స్, గంజాయి నిల్వ కేంద్రం కోసం జిల్లా ప్రిన్సిపాల్ డిస్ట్రిక్ జడ్జి జస్టిస్ ఈ.భీమారావు, మొదటి అదనపు జిల్లా జడ్జి, నార్కోటిక్ డ్రగ్స్ కోర్టు జడ్జి సి.సత్యవాణి, జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, తదితరులు స్థల పరిశీలన చేశారు. త్వరితగతిన నార్కోటిక్స్, గంజాయి నిల్వ కేంద్రం కోసం స్థల పరిశీలన సర్వే పూర్తి చేయాలని మండల సర్వేయర్, ఆర్.అండ్.బి ఎస్ఈ, తదితర శాఖల అధికారులకు జిల్లా ప్రిన్సిపాల్ డిస్ట్రిక్ జడ్జి, జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డిఎస్పి నీలకంటేశ్వర్ రెడ్డి, డిటిసి డిఎస్పి సూర్యనారాయణ రెడ్డి, నగరపాలక సంస్థ కమిషనర్ జస్వంత్ రావు, డిసిఆర్బి సిఐ వలీ భాష, ఆర్ఐలు మధు, పవన్ కుమార్ ఆర్.అండ్.బి ఎస్ఈ మురళీకృష్ణ, తహసీల్దార్ మోహన్ కుమార్, నగరపాలక సంస్థ ఈఈ షాకీర్, మండల సర్వేయర్, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీవారి సేవకుడు ఆళ్లగడ్డ రాముకు ఘన సత్కారం



**అనంతపురం - సూర్య వాస్తవం:** రైతు పాద సేవ మహోత్సవం కార్యక్రమంలో శ్రీవారి సేవకులకు చిరు సత్కారం నిర్వహించారు. అనంతపురం పట్టణంలోని స్థానిక గుత్తి రోడ్డు లోని సోముల దొడ్డి సమీపంలో గల హనుమంతు మొక్కల దాత కార్యాలయంలో మంగళవారం నాడు రైతు పాద సేవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కల దాత హనుమంతు మాట్లాడుతూ.... రైతు పాద సేవ కార్యక్రమంలో రైతులతో పాటు తులసి ఉసరి, ఎన్నో మొక్కలు అనంతపురం పట్టణంలో ఉచితంగా పంపిణీ చేసిన శ్రీవారి సేవకులకు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీవారి సేవకులు ఆళ్లగడ్డ రాము, శ్రీనివాస్, శివ, ప్రకాష్, సురేష్, రామ్ శేషు, అనిల్, ప్రసాద్, సుంకు రెడ్డి, నాగరాజు తదితరులు మొమెంటులు అందుకున్నారు.





# హైవేపై బైక్‌ను ఢీకొన్న కారు

**- ఇద్దరికి గాయాలు...**




**పెళ్ళకూరు- సూర్య వాస్తవం:** పెళ్లకూరు మండల పరిధిలోని పెళ్లకూరు హైవే వద్ద మంగళవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమా దంలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయ పడ్డారు. వెనుక నుంచి అతివేగంగా వచ్చిన కారు, ముందుగా వెళ్తున్న బైక్‌ను ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. విలేకరులతో మాట్లాడుతూ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... శ్రీకాళహస్తి నుంచి నాయుడుపేట వైపు ప్రయాణిస్తున్న కారు, అదే మార్గంలో బైక్‌పై వెళ్తున్న వారిని ఢీకొట్టింది. ఈ ఘటనలో తొట్టంబేడు మండలం ఎగువ కొనతనేరి గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు (35), చెంచు రెడ్డి (40) తీవ్రంగా గాయపడ్డారు. వీరు బైక్‌పై నాయుడుపేటకు వెళ్తున్న సమయంలో ప్రమాదం జరిగిందన్నారు. ప్రమాదం తీవ్రతకు బైక్‌పై ఉన్న ఇద్దరూ రోడ్డుపైకి ఎగిరిపడగా, కారు ముందు భాగం సాక్షికంగా తీవ్రంగా దెబ్బతిన్నది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని గాయపడిన వారిని 1033 అంబులెన్స్ ద్వారా శ్రీకాళహస్తి గవర్నమెంట్ హాస్పిటల్కు తరలించారు. ప్రస్తుతం వారికి వైద్యం కొనసాగుతోందని తెలిపారు. ఈ ప్రమాదానికి అతివేగమే ప్రధాన కారణమని పోలీసులు పేర్కొన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు వెల్లడించారు.

# రీసర్వే పనులను వేగవంతం చేయాలి

- జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్
- సింగనమల మండలం చక్రాయపేట గ్రామంలో రీసర్వే పనులను పరిశీలించిన జేసీ



**అనంతపురం కలెక్టరేట్ – సూర్య వాస్తవం :** రీసర్వే పనులను వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్ ఆదేశించారు. మంగళవారం సింగనమల మండలం చక్రాయపేట గ్రామంలో ఆంధ్రప్రదేశ్ రీసర్వే పథకం కింద చేపట్టిన 4వ విడత రీసర్వే పనులను జాయింట్ కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ చక్రాయపేట గ్రామంలో నాలుగవ విడత రీసర్వే పనులను చేపట్టడం జరుగుతోందని, ప్రభుత్వం నిర్దేశించిన సమయంలోగా రీసర్వే పనులను వేగంగా చేపట్టాలని ఆదేశించారు. గ్రామంలో గ్రౌండ్ ట్రూ థింగ్, వెట్రైజేషన్, వ్యాలిడేషన్ పనులను పరిశీలించి, రీసర్వేపై రైతులతో జాయింట్ కలెక్టర్ మాట్లాడారు. రీసర్వే నోటీసులు సక్రమంగా జారీ చేశారా అంటూ ఆరా తీయగా, జారీ చేశారు అంటూ రైతులు తెలిపారు. రీసర్వేకు రైతులు సహకారం అందించాలని జాయింట్ కలెక్టర్ సూచించారు. రీసర్వేను వేగంగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్వే ఎడి రూప్లనాయక్, తహసీల్దార్ శేషారెడ్డి, మండల సర్వేయర్, గ్రామ సర్వేయర్లు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.



**సింగనమల సివిల్ సప్లై గోదాము తనిఖీ :** అనంతరం సింగనమల మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో ఉన్న సివిల్ సప్లై గోదామును జాయింట్ కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోదాములో స్టాకు నిల్వలను, ఇతర వివరాలు ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై డిఎం రమేష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# బ్రేక్ ఇన్‌స్పెక్టర్‌ను వెంటనే సస్పెండ్ చేయాలి

- సిఐటియు బృందం



**పత్తికొండ టౌన్ – సూర్య వాస్తవం :** పత్తికొండ మండలం గుండుతాండ గ్రామానికి చెందిన 20 మంది ఉపాధి కూలీలు మంగళవారం ఉదయం 5 :30 సమయంలో పక్కనే ఉన్న రామచంద్రపురం గ్రామంలో పని దొరకడంతో అక్కడికి ఆటోలో వెళుతుండగా ఆటోకు బ్రేకులు ఫెయిల్ అయి ప్రమాదం జరిగింది. ఈ ఘటన జరిగిన వెంటనే క్షతగాత్రులను ప్రభుత్వ వైద్యశాలలో పత్తికొండ సిఐటియు బృందం వారిని పరామర్శించి విషయం తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తికొండ డివిజన్ పరిధిలో బ్రేక్ ఇన్‌స్పెక్టర్ ఆర్టీవో అధికారులు పర్యవేక్షణ లోపం వల్లే ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని వెంటనే వారిని సస్పెండ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. గాయపడిన వారిని ప్రమాదంలో తీవ్రంగా ప్రాణాపాయ స్థితిలో కర్నూల్ లో చికిత్స పొందుతున్న వారికి వెంటనే ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకుని వారికి మెరుగైన వైద్యాన్ని అందించాలని ఆయన డిమాండ్ చేశారు. పత్తికొండ పట్టణంలో కూడా ఈ మధ్యకాలంలో అనేక ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ అధికారులు నాయకులు ఏమాత్రం పట్టించుకోకపోవడం పత్తికొండ ప్రాంత ప్రజల దురదృష్టమని గత 15 సంవత్సరాల నుండి రోడ్డు వెడల్పీకరణ జరుగుతుందని ఎంతో ఆశతో ఎదురుచూస్తున్న పత్తికొండ ప్రజలకు నాయకులు మారుతున్నారు తప్ప రోడ్డు మాత్రం వెడల్పు కాకపోవడం పైపెచ్చు అనేక ప్రమాదాలు జరిగిన సమయంలో ప్రజలు అధికారులు నాయకులు అయ్యో పాపం అంటూ చేతులు దులుపుకోవడం తప్ప ఎలాంటి చర్య తీసుకోక పోవడం విడ్డూరమన్నారు. గత ప్రభుత్వంలో కూడా పత్తికొండ పట్టణంలోని స్థానిక కొండగిరి దగ్గర ఉన్న బొడ్రాయి దగ్గర మాజీ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో భూమి పూజ కూడా జరగడం అది కాస్త ఆగిపోవడం అనంతరం కొత్త ప్రభుత్వంలో కూడా నాయకులు పట్టించుకోకపోవడం చూస్తుంటే పత్తికొండ తలరాత మారే పరిస్థితులు లేవని అటు ప్రజలు ఇటు ప్రమాద బాధితులు ప్రేక్షక పాత్ర వహించవలసి వస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇక బైపాస్ రోడ్డులో కూడా ఈ మధ్య కాలంలో మనిషి లోతు గుంతలు పడిన అధికారులు నిమ్మకు నీరెత్తిన విధంగా ఉండడం హాస్యాస్పదమని మరమ్మతులకైనా నోచుకోలేని బైపాస్ లో రాత్రికి రాత్రి ప్రమాదాలు జరిగితే పరిస్థితి ఏమిటని ఆయన ప్రశ్నించారు. వెంటనే ఉన్నతాధికారులు నిర్లక్ష్యం వహిస్తున్న అటువంటి అధికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు జయప్రకాశ్ రెడ్డి కారన్న శీను రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.





# రోడ్డు మార్గాలలో పాటించవలసిన భద్రతపై అవగాహన సదస్సు




**వేంపల్లె – సూర్య వాస్తవం:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదేశానుసారంగా స్థానిక పట్టణ వైఎస్ఆర్ వేగంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్‌ఎస్ యూనిట్- 2 ఆధ్వర్యంలో విద్యార్థులకు ట్రాఫిక్ నియమాలు, రోడ్డు భద్రతపై అవగాహన సదస్సును ఏర్పాటు చేయడమైనదని ప్రిన్సిపాల్ ఎస్.నాగేంద్ర తెలిపారు. రోడ్డు భద్రత అవగాహనపై పాటించవలసిన నియమ నిబంధనలను తెలియజేసి వాహనాలను నడపడంలో పాటించవలసిన జాగ్రత్తలను ఉదాహరణ సహా వివరించారు. ఈ సందర్భంగా స్థానిక పట్టణ సబ్ ఇన్‌స్పెక్టర్ తిరుపాల్ నాయక్ ముఖ్యఅతిథిగా పాల్గొని, విద్యార్థులను ఉద్దేశించి రేపటి తరం అయినటువంటి మీరు జాగ్రత్త వహించి రోడ్డు ప్రమాదాలకు గురికాకుండా పాటించవలసిన నియమాలు తెలియజేసినారు. మీపై తల్లిదండ్రులు ఎన్నో ఆశలు పెట్టుకొని జీవిస్తుంటారని ప్రస్తుత కాలంలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు ఎక్కువ అవుతున్నాయని వీటిలో ముఖ్యంగా యువత సెల్ఫోన్ డ్రైవింగ్, డ్రంక్ అండ్ డ్రైవింగ్, మొదలగు వివిధ రోడ్ల ప్రమాదాలను గూర్చి వివరించారు. నివారించడానికి ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్న రోడ్డు ప్రమాదాలు పునరావృతం అవుతున్నాయని వాపోయారు. తగు జాగ్రత్తలు తీసుకొని సేఫ్ డ్రైవింగ్ కొరకు అందరూ పాటుపడాలని విద్యార్థులకు వివరించారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ మల్లేశ్వరమ్మ మాట్లాడుతూ విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహనలో భాగంగా ఎస్సే రైటింగ్ పోటీలు నిర్వహించి విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో చరిత్ర శాఖాధిపతి డాక్టర్ బాలకొండ గంగాధర్, కంప్యూటర్ అధ్యాపకులు షపిఉద్దీన్, కిరణ్మయి, ఫిజికల్ డైరెక్టర్ తేజేంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

# చెరువుల నీటి విడుదలపై నిషేధం కోరుతూ జల వనరుల శాఖ లేఖ

- చిల్లకూరు, చింతాలమ్మ, మన్నె ముత్తరి చెరువుల తూములు తీయరాదని రెవెన్యూ అధికారికి విజ్ఞప్తి





**పెళ్లకూరు – సూర్య వాస్తవం:** తిరుపతి జిల్లా పెళ్లకూరు మండలం చిల్లకూరు గ్రామ పరిధిలో ఉన్న చిల్లకూరు చెరువు, చింతాలమ్మ చెరువు, మన్నె ముత్తరి చెరువుల నుంచి నీటి విడుదలను నిలిపివేయాలని జల వనరుల శాఖ కోరింది. ఈ మేరకు ఇరిగేషన్ సెక్షన్ నెం. 2, పెళ్లకూరు సహాయ నిర్వాహక ఇంజనీర్ శ్రీ చొప్పున శ్రీనివాసులు బి.టి.కె. మండల రెవెన్యూ అధికారికి లేఖ సమర్పించారు. చిల్లకూరు గ్రామంలోని ఈ మూడు చెరువుల పరిధిలో సుమారు 500 ఎకరాల ఆయకట్టు ఉందని లేఖలో పేర్కొన్నారు. చెరువుల్లోని నీటిని సాగు మరియు త్రాగునీటి అవసరాలకే వినియోగించాల్సి ఉంటుందని, ఇతర అవసరాలకు వినియోగించరాదని స్పష్టం చేశారు. రైతులు రెండో పంటకు సిద్ధమవుతున్న నేపథ్యంలో, రెండో పంట సాగుకు నీటి అవసరం అధికంగా ఉండటంతో చెరువుల నీటిని సంరక్షించాల్సిన అవసరం ఉందని వివరించారు. ఈ నేపథ్యంలో, చిల్లకూరు, చింతాలమ్మ, మన్నె ముత్తరి చెరువులకు సంబంధించిన తూములను ఎట్టి పరిస్థితుల్లోనూ తీయరాదని దండోరా వేయించి ప్రజలకు తెలియజేయాలని జల వనరుల శాఖ కోరింది. చిల్లకూరు నీటి సంఘం అధ్యక్షుడు పాపాడి రాజగోపాల్ రెడ్డి సమర్పించిన అర్జీ ఆధారంగా ఈ చర్యలు చేపట్టినట్లు లేఖలో పేర్కొన్నారు. తగు సమాచారం మేరకు తదుపరి చర్యలు తీసుకోవాలని కోరుతూ ఈ లేఖను సమర్పించినట్లు అధికారులు తెలిపారు. రైతుల ప్రయోజనాలు, ఆయకట్టు భద్రత దృష్ట్యా నీటి నిర్వహణపై కఠిన నిర్ణయాలు అవసరమని జల వనరుల శాఖ స్పష్టం చేసింది.

# అర్బన్ సీఐగా వెంకటేశ్వర్లు బాధ్యతల స్వీకారం

- శాంతిభద్రతల పరిరక్షణకు కట్టుబడి ఉంటామని హామీ



**నాయుడుపేట– సూర్య వాస్తవం:** నాయుడుపేట పట్టణానికి నూతన సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా (సీఐ) వెంకటేశ్వర్లు మంగళవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన పోలీసు శాఖ బదిలీలలో భాగంగా ఆయనను నాయుడుపేట అర్బన్ సీఐగా నియమించారు. ఇంతకు ముందు ప్రకాశం జిల్లా పొదిలి ప్రాంతంలో సీఐగా విధులు నిర్వహించిన వెంకటేశ్వర్లు వీఆర్‌కు వెళ్లిన అనంతరం తాజా ఆదేశాలతో నాయుడుపేటకు నియమితులయ్యారు. పదవీ బాధ్యతలు చేపట్టిన అనంతరం విలేకరులతో మాట్లాడుతూ పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు కృషి చేస్తానని చెప్పారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అలాగే పట్టణంలో ట్రాఫిక్ సమస్యలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక చర్యలు చేపడతామని వెల్లడించారు. రహదారులపై నియంత్రణ చర్యలు తీసుకుని ట్రాఫిక్ వ్యవస్థను క్రమబద్ధీకరిస్తామని పేర్కొన్నారు. పోలీసు సిబ్బంది సహకారంతో ప్రజల భద్రత, శాంతి, క్రమశిక్షణ పరిరక్షణలో మరింత సమర్థంగా పనిచేస్తామని వెంకటేశ్వర్లు తెలిపారు.

# డా. బి.ఆర్. అంబేద్కర్ గురుకుల పాఠశాలలో డివార్మింగ్ డే



**పులివెందుల – సూర్య వాస్తవం:** మండలంలోని బేస్తవారిపల్లి గ్రామంలో ఉన్న డా. బి.ఆర్. అంబేద్కర్ గురుకుల పాఠశాలలో జాతీయ డివార్మింగ్ డే కార్యక్రమాన్ని యూపిహెచ్‌సీ. బాకరాపురం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మొత్తం 393 మంది విద్యార్థులకు అల్బెండాజోల్ మాత్రలు అందజేశారు. ఈ కార్యక్రమాన్ని మెడికల్ ఆఫీసర్ డా. శాంతి కుమార్ పర్యవేక్షణలో, ఎంపీహెచ్ఈఓ ఎన్. సతీష్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. డా.శాంతి కుమార్ మాట్లాడుతూ ఈ మాత్రలు తీసుకోవడం వల్ల పిల్లల ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు, రక్తహీనత, పోషకాహార లోపం తగ్గి, వారి శారీరక, మానసిక అభివృద్ధికి దోహదపడుతుందని తెలుపడమైనది. ప్రేమలత, ఏఎన్ఎమ్ విద్యార్థులకు మాత్రలు ఇచ్చి మింగించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ఎం.శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ పిల్లలు ఆరోగ్యంగా ఉండేందుకు ప్రభుత్వం చేపడుతున్న ఈ కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

- అడిషనల్ డీఎంహెచ్వో జయలక్ష్మి




**గుంతకల్ – సూర్య వాస్తవం:** పట్టణంలోనే అన్ని వార్డులలో గుంతకల్ పిపీ యూనిట్ హాస్పిటల్, అర్బన్ హాస్పిటల్స్ వైద్య సిబ్బంది జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మంగళవారం చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని పట్టణంలోనే రాజేంద్రప్రసాద్ మున్సిపల్ హైస్కూల్లో అడిషనల్ జిల్లా వైద్య అధికారిని డాక్టర్ జయలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 1 నుంచి 19 ఏళ్ల మధ్య వయస్సు గల పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేయడం జరిగిందన్నారు. భోజనం చేసిన అరగంట తర్వాత మాత్రలు తీసుకోవాలని చిన్నారులకు తెలిపారు. ఏవైనా కారణాల వల్ల మాత్రలు తీసుకోలేకపోయిన వారికి ఈ నెల 24వ తేదీన మరల ఆల్బెండజోల్ మాత్రలను ఇవ్వడం జరుగుతుంద న్నారు. ఈ కార్యక్రమంలో వైద్య అధికారులు డాక్టర్ అరుణ, డాక్టర్ గంగాధర్, డాక్టర్ రఘునందన్, సూపర్వైజర్ పద్మలత, ఎంపిహెచ్ఏలు మేరీ సుజాత, సావిత్రి, ఆర్. పద్మావతి, సలోమి, జ్యోతి, వార్డు సచివాలయ హెల్త్ కార్యదర్శులు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# పేదల పాలిట ఆశాజ్యోతి..... ఆర్‌డిటి

- ఆర్‌డిటితో పేదల జీవితాల్లో వెలుగులు
- గ్రామీణ ప్రాంతాల్లో అత్యాధునిక వైద్య సౌకర్యాలను అందించిన సంస్థ
- మహిళలకు స్వయం ఉపాధి కల్పించిన ఘనత ఆర్‌డిటి
- కరువు ప్రాంతాలలో పేద కుటుంబాల అభ్యున్నతికి కృషి
- ఎఫ్‌సిఆర్‌ఏ అనుమతిని నిలిపివేయడం దారుణం
- కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ మౌలానా నవాజ్ బియాబానీ చిష్తిఉల్ ఖాద్రీ
- ప్రజా సంఘాలతో కలిసి ధర్నా



**అనంతపురం – సూర్య వాస్తవం:** రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ అనేక దశాబ్దాలుగా అనంతపురం జిల్లాలో పేదల కోసం సేవలు అందిస్తూ ఆదర్శంగా నిలిచిందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ మౌలానా నవాజ్ బియాబానీ చిష్తిఉల్ ఖాద్రీ తెలిపారు. కేంద్రం ఎఫ్‌సిఆర్‌ఏ అనుమతిని నిలిపివేయడం దారుణమని ఆయన మండిపడ్డారు. నిరుపేదలకు అన్నం పెట్టే సంస్థ దొంగలయ్యారు. దోచుకునేవాడు దేవులయ్యారని ఆయన ఎద్దేవా చేశారు. ఆర్డిటి సేవలు తిరిగి ప్రారంభించాలని అయన ప్రజా సంఘాల నాయకులు సాకే హరి, ఐ. ఏం. ఏం మహబూబ్ బాషా లతో కలిసి డిమాండు చేస్తూ మంగళవారం నాడు పట్టణంలోని స్థానిక హెడ్ పోస్ట్ ఆఫీస్ దగ్గర ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ....గత 55 ఏళ్లుగా అనంతపురం జిల్లాలో నిరంతర సేవలందిస్తూ వేలాదిమందికి ఆశాజ్యోతి అయిన రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ సేవలు నిలిపివేయడం దారుణమని తెలిపారు. ఆర్‌డిటి సేవలు నిలిచిన నేపథ్యంలో, నిరుపేదల భవిష్యత్తు స్పష్టత లేకుండా పోతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.





కరోనా నైపద్యంలో కోవిడ్ ఆసుపత్రి వేల మందికి పైగా రోగులకు సేవలందించింది మరిచారా అని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఆయన చురకలంటించారు. కేంద్ర ప్రభుత్వం ఫారిన్ కాంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ యాక్ట్ పునరుద్ధరణను నిలిపివేయడంతో, సంస్థకు విదేశాల నుంచి వచ్చే విరాళాలు పూర్తిగా ఆగిపోయాయని దీంతో విద్య, ఆరోగ్యం, మహిళా సాధికారత, పర్యావరణం, ఉపాధి శిక్షణ వంటి అనేక రంగాల్లో సేవలు మూతపడ్డాయని ఆయన తెలియజేసారు. నిరుపేదల భవిష్యత్తు స్పష్టత లేకుండా పోతోందని అయన ఆవేదన వ్యక్తం చేశారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే ఈ సంస్థకు ఎఫ్‌సిఆర్‌ఏ పునరుద్ధరణను మంజూరు చేసి, సేవల పునరుద్ధరణకు సహకరించా లని మౌలానా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# మధ్యాహ్న భోజనంలో నాణ్యత లేకపోతే చర్యలు తప్పవు

- అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ హెచ్చరిక
- ఐవీఆర్ఎస్‌లో ఫిర్యాదులపై స్పందించిన ఎమ్మెల్యే దగ్గుపాటి
- ఎంఈఓలు తరచూ ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలన్న ఎమ్మెల్యే
- ప్రధానోపాధ్యాయులు ప్రతి రోజు భోజనం పరిశీలించాలని సూచన
- మధ్యాహ్న భోజనంలో నాణ్యత లేకపోతే చర్యలు తప్పవు



**అనంతపురం – సూర్య వాస్తవం:**
ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యత లేదంటూ వచ్చిన ఫిర్యాదులపై అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ స్పందించారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తోంది. అయితే ఈ పథకం నిర్వహణపై ఐవీఆర్ఎస్ సర్వే నిర్వహిస్తూ లోపాలను గుర్తిస్తోంది. ఈ క్రమంలో అనంతపురం అర్బన్ నియోజకవర్గంలోని ఓ పాఠశాలలో భోజనం నాణ్యత బాగాలేదని తల్లిదండ్రులు చెప్పారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఎంఈఓలతో పాటు ఇతర అధికారులతో ఫోన్ లో మాట్లాడారు. భోజనం అధ్వాన్నంగా ఉందని తల్లిదండ్రులు చెబుతున్నారంటే అధికారుల పర్యవేక్షణ ఏమైందని ప్రశ్నించారు. ఏజెన్సీలు ఇష్టారాజ్యంగా వారికి తోచింది పెడుతామంటే కుదరదని.. ప్రభుత్వం నిర్దేశించినా నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. ప్రతి రోజు ఏదో ఒక పాఠశాలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలన్నారు. లోపాలు గుర్తిస్తే.. వెంటనే ఏజెన్సీపై చర్యలకు సిఫార్సు చేయాలన్నారు. ప్రతి పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు పిల్లలు తినే ఆహారాన్ని పరిశీలించాలని.. అవసరమైతే రుచి చూసి మార్పులు చేయాలన్నారు. ఏజెన్సీ వారు వినకపోతే.. డీఈఓకి తెలియజేయాలన్నారు. ప్రభుత్వం మంచి ఉద్దేశ్యంతో తీసుకొచ్చిన ఈ పథకంలో లోపాలను సహించేది లేదన్నారు. అసెంబ్లీ సమావేశాల అనంతరం తాను కూడా నేరుగా పాఠశాలలకు వెళ్లి మధ్యాహ్నభోజన నాణ్యతను పరిశీలిస్తానని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు.

## మార్చి మొదటి వారంలో
# ఎస్ఎస్‌సి హాల్ టికెట్లు

- హాల్ టికెట్లలో తప్పుల సవరణకు మరోసారి అవకాశం
- జిల్లా డీఈవో సుబ్రహ్మణ్యం, అసిస్టెంట్ కమిషనర్ ఫర్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్ కొండూరు శ్రీనివాసరాజు వెల్లడి



**అన్నమయ్య బ్యూరో – సూర్య వాస్తవం:** మార్చి–2026లో 16.03.2026 నుండి 01.04.2026 నిర్వహించబడనున్న ఎస్ఎస్‌సి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల హాల్ టికెట్లు మార్చి మొదటి వారంలో విడుదల చేయనున్నట్లు జిల్లా డీఈవో సుబ్రహ్మణ్యం, ప్రభుత్వ పరీక్షల జిల్లా అసిస్టెంట్ కమిషనర్ కొండూరు శ్రీనివాసరాజు మంగళ వారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అభ్యర్థుల హాల్ టికెట్లు బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్, ఆంధ్రప్రదేశ్ అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచబడతాయని తెలిపారు. అదనంగా, సంబంధిత పాఠశాలల లాగిన్‌లు, లీఫ్ యాప్, వాట్సాప్ గవర్నెన్స్ (మన మిత్ర) ద్వారా కూడా హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకునే సౌకర్యం కల్పించబడుతుంద న్నారు. అన్ని పాఠశాలల ప్రధానోపా ధ్యాయులు హాల్ టికెట్లలో ముద్రించబడిన విద్యార్థుల వివరాలు – ఇంటిపేరు, అభ్యర్థి పేరు, జన్మతేదీ, ఇతర వివరాలను పాఠశాల రికార్డులతో సరిపోల్చి జాగ్రత్తగా పరిశీలించవలసిందిగా సూచించారు. ఇంటిపేరు, అభ్యర్థి పేరు మరియు జన్మతేదీలలో ఏవైనా పొరపాట్లు గమనించిన పక్షంలో, వాటి సవరణ కోసం (యూ డి ఐ ఎస్ ఈ) పోర్టల్‌లో ప్రత్యేక సవరణ విండోను 31.03.2026కు ముందు ప్రారంభించనున్నట్లు తెలిపారు. అందువల్ల విద్యార్థులు, తల్లిదండ్రులు ఎటువంటి ఆందోళన చెందవలసిన అవసరం లేదని, అవసరమైన సవరణలకు తగిన అవకాశం కల్పించబడుతుందని స్పష్టం చేశారు.

## రైల్వే అసిస్టెంట్ లోకో పైలట్‌గా
# ఈసీఈ విభాగపు విద్యార్థి ఎంపిక



**వేంపల్లె – సూర్య వాస్తవం:** ఆర్జియుకేటి ఆర్కే వ్యాలీలో 2016 బ్యాచ్‌కి చెందిన ఈసీఈ విభాగపు విద్యార్థి, బి. సాయికుమార్ రైల్వే అసిస్టెంట్ లోకో పైలట్‌గా ఎంపిక అయ్యాడు. ఈ సందర్భంగా సదరు విద్యార్థి తన ఆనందాన్ని పంచుకోవడానికి నేడు ఆర్కే వ్యాలీ డైరెక్టర్ ను కలిశారు. తనకు విద్య నేర్పిన అధ్యాపకులకు, యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. తాను ఇంతటితో ఆగకుండా ఎస్ ఎస్ సి గ్రాడ్యుయేట్ కంబైన్డ్ లెవెల్ ఎగ్జామినేషన్లో సెకండ్ లెవెల్ కూడా రాశానని ఫలితాల కోసం ఎదురుచూస్తున్న అని తెలిపారు. అతను మాట్లాడుతూ ఇక్కడ చదువుకోవడానికి అన్ని అవకాశాలు అందుబాటులో ఉన్నాయి. కావున ఇక్కడ చదువుకుంటున్న విద్యార్థులు అందుబాటులో ఉన్న అవకాశాలను వినియోగించుకుని తమ భవిష్యత్తుకు సోపానాలు ఏర్పరచుకోవాలని తెలిపారు. అదేవిధంగా కష్టపడి ఇష్టంగా చదివితే సాధించలేనిది ఏమీ లేదన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ప్రొఫెసర్ ఏవీఎస్ఎస్ కుమారస్వామి గుప్తా, పరిపాలన అధికారి డాక్టర్ పి.రవికుమార్, డీన్ అకాడమిక్స్ రమేష్ కైలాస్, ఈసీఈ అధ్యాపకుడు పవన్ కుమార్ పవన్ కుమార్, బయాలజీ మెంటల్ డాక్టర్ జి.తిరుపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థినులు కష్టపడి చదవాలి

- కేపీ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కోలా ప్రసాద్
- అట్టలు, పెన్నులు పంపిణీ

**పులివెందుల – సూర్య వాస్తవం:** పులివెందుల పట్టణంలోని శ్రీరామహాల్ రోడ్డు సమీపంలో ఉన్న వై.ఎస్.వి.పి.ఎం మహిళా జూనియర్ కళాశాలలో 500 మంది విద్యార్థినిలకు కె.పి ఫౌండేషన్ చైర్మన్ , దళిత ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కోలా ప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం అట్టలు, పెన్నులు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినిలు బాగా కష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలన్నారు. ఈ కాలేజీ నుండిజిల్లా మొదటి ర్యాంకు, నియోజకవర్గ మొదటి ర్యాంకు, పట్టణ మొదటి ర్యాంకు సాధించిన విద్యార్థినులకు ప్రత్యేక బహుమతులు ఇవ్వడం జరుగుతుందన్నారు. విద్యార్థినిలు సెల్ ఫోన్లు చూడడం మానుకోవాలి అన్నారు. సెల్ ఫోన్లు చూడడం వలన అనేక నష్టాలు ఉన్నాయన్నారు. బాగా చదివి కాలేజీకి, మన ఊరికి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. మహిళల కోసం ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాలను తీసుకురావడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ ప్రశాంత్, పాస్టర్ కృప రాజు, పాస్టర్ దేవరాజు, అశోక్ ప్రకాష్ రాజు అజారుద్దీన్ చిన్నప్ప విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# రక్తం ఇచ్చి.... ప్రాణం పోసి


- మానవత్వం చాటుకున్న మెడికల్ రెప్ జయకుమార్



**అనంతపురం –సూర్య వాస్తవం:**
అనంతపురం పట్టణానికి చెందిన డెంటల్ మెడికల్ రెప్ యాల్లకొండ దాసరి జయకుమార్ కుమార్ అనే యువకుడు 3వ సారి రక్త దానం చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పేషెంట్ కు అత్యవసరంగా రక్తం అవసరమైనప్పుడు జయకుమార్ స్పందించి బ్లడ్ బ్యాంకుకు వెళ్లి సహాయం అందించి పలువురు యువతకు ఆదర్శంగా నిలిచాడు. ప్రాణాపాయంలో ఉన్నవారిని కాపాడేందుకు యువత రక్తదానం చేయడానికి ముందుకు రావాలని జయకుమార్ తెలిపారు.ఆపదలో ఉన్నవారికి రక్తదానం చేయడం ద్వారా ఎన్నో ప్రాణాలను కాపాడవచ్చునని అయన అన్నారు

## 17,18,19 తేదీలలో జరిగే
# సుదర్శన యాగం విజయవంతం చేద్దాం

- వై.నాగేశ్వరరావు యాదవ్ జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు, కర్నూలు డీసీఎంఎస్ చైర్మన్





**కర్నూల్ –సూర్య వాస్తవం :** కర్నూలులోని శ్రీకృష్ణ ఆలయంలో సుదర్శన యాగాన్ని విజయవంతం చేయాలని వై నాగేశ్వరరావు యాదవ్, అయ్యన్న యాదవ్, శేషిపాణి యాదవ్, శ్రీరాములు యాదవ్, నాగేశ్వరరావు యాదవ్, డాక్టర్ ఈశ్వరయ్య యాదవ్, తిక్కన్న యాదవ్, బిజెపి నాగరాజు యాదవ్, రమణ యాదవ్, రాజు యాదవ్, విజయలక్ష్మి యాదవ్, పద్మావతి యాదవ్, యాదవ కమిటీ సభ్యులు కోరారు. ఈ సందర్భంగా యాదవ సంఘం నాయకులు మాట్లాడుతూ కర్నూలు నగర హిందూ బంధువులందరికీ ఆహ్వానం. కర్నూలు నగరంలో నంద్యాల చెక్ పోస్ట్ శ్రీ కృష్ణని దేవస్థానం నందు ఫిబ్రవరి 17,18,19 వ తేదిలలో ఉదయం 10 గంటలకు “శ్రీ సుదర్శన హోమం” జరుగుతుంది. కావున భక్తదులందరూ పాల్గోని జయప్రదం చేయగలరని శ్రీ కృష్ణ ఆలయ కమిటి సభ్యులు కోరారు.

# 19న గుండె సంబంధిత వైద్యులు రాక

**వేంపల్లె –సూర్య వాస్తవం :** ఈనెల 19వ తేదీన ప్రముఖ కార్డియాలజీస్ట్ వైద్యులు డాక్టర్ ఎన్.శ్రావణ్ కుమార్ రెడ్డి వేంపల్లెకు రానున్నట్లు డాక్టర్ బాషా హాస్పిటల్ సిబ్బంది తెలిపారు. కడప నగరంలోని వేదాంత హాస్పిటల్ కి చెందిన ప్రముఖ వైద్య నిపుణులు గుండె సంబంధిత వ్యాధులపై వైద్య సేవలు అందించనున్నట్లు వెల్లడించారు. దీంతో పాటు ఇసిజీ, 2డి ఇకో సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మండలంలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు డాక్టర్ అందుబాటులో ఉండనున్నట్లు తెలిపారు. మరిన్ని సమాచారం కోసం స్థానిక బాషా హాస్పిటల్ సిబ్బందిని సంప్రదించాలని కోరారు.

# మహిళల సమస్యల పరిష్కారానికి కృషి చేయండి

- జిల్లా ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు వార్డు పోలీసులతో ప్రత్యేక సమావేశం
- మహిళల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి
- ట్రైనీ ఐపిఎస్ అధికారి, మహిళా డీఎస్పీల సంయుక్త పిలుపు





**అనంతపురం క్రైమ్ – సూర్య వాస్తవం:** అనంతపురం జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో మహిళల భద్రత, సంక్షేమంపై మరింత సమర్థవంతమైన చర్యలు తీసుకునేందుకు ప్రత్యేక చర్యలు కొనసాగుతున్నాయి. జిల్లా ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు ఈ రోజు స్థానిక పోలీస్ కాన్ఫరెన్స్ హాల్లో నగరంలోని వార్డ్ మహిళా పోలీసులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ట్రైనీ ఐపిఎస్ అధికారి అశ్విని మణిదీప్, అనంతపురం మహిళా పోలీస్ స్టేషన్ డిఎస్పి మహబూబ్ బాషా పాల్గొని దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ...మహిళల సమస్యలను వేగంగా, చట్టబద్ధంగా పరిష్కరించాల్సిన అవసరాన్ని అధికారులు వివరించారు. కుటుంబ హింస, వేధింపులు, సైబర్ నేరాలు, బాలికల భద్రత వంటి అంశాలపై ఎలా స్పందించాలి, బాధితులకు ఎలా ధైర్యం చెప్పాలి, కేసుల నమోదు మరియు దర్యాప్తు ప్రక్రియలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దిశానిర్దేశం చేశారు. ప్రతి మహిళా పోలీసు తమ పరిధిలో మహిళలతో సన్నిహితంగా మమేకమై, వారి సమస్యలను ముందుగానే గుర్తించి, సమయానుకూలంగా పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. మహిళలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే విధంగా విధులు నిర్వహిస్తూ, వారి నమ్మకాన్ని గెలుచుకోవాలని స్పష్టం చేశారు.

# శ్రీ ఈశ్వరి దేవి మఠంలో మహా ప్రసాద వినియోగంతో ముగిసిన ఉత్సవాలు



**బ్రహ్మంగారిమఠం – సూర్య వాస్తవం:** మహా ప్రసాద వినియోగంతో శివరాత్రి మహోత్సవాలు వైభవంగా ముగిసినట్లు కార్య నిర్వహణ అధికారి జగన్మోహన్ రెడ్డి తెలిపారు. మహా శివరాత్రి మహోత్సవాలలో చివరి రోజు మంగళవారం జగన్మాత శ్రీ ఈశ్వరీ దేవి మఠమునందు జగన్మాత శ్రీ ఈశ్వరీ దేవి మఠం మఠాధిపతులు శ్రీ శ్రీ వీర శివ కుమార స్వాములవారు ఆధ్వర్యంలో మహా ప్రసాదాన్ని క్యూ లైన్ ద్వారా రాష్ట్ర నలు మూలల నుంచి వచ్చిన భక్తులకు మహా ప్రసాదాన్ని అందిస్తున్న మఠం మఠాధిపతులు శ్రీశ్రీశ్రీ వీర శివకుమార స్వాములవారి తమ్ముడు శ్రీ సంపత్ కుమారస్వామి

# టీఎం రమేష్ దారుణ హత్య ఘటన మరువకనే మరో దారుణ ఘటన

- అగ్రవర్ణాలకు బలైపోతున్న మాదిగలు



**గుత్తి – సూర్య వాస్తవం:** గుత్తి మండలం బేతాపల్లి గ్రామంలో మాదిగ బోయగడ్డ నాగరాజు పై హ త్యా ప్రయత్నం నిన్న రాత్రి దళిత కాలనీకీ దాదాపుగా ముప్పై మంది బో యకులానికి చెందిన వారు నాగరా జు ఇంటి మీదికి వచ్చి ఇనుప రాడ్లు, కర్రలు,రాళ్లతో దాడి చేసి కారును ధ్వంసం చేసి బైక్ ను ధ్వంసం చేసి కులం పేరుతో నానా దుర్భషాలాడు తూ కాలనీ వాసులను భయభ్రాంతు లకు గురిచేస్తూ విధ్వంసం సృష్టిస్తూ నాగరాజు ఎదుగుదల ను ఓర్వలేక హత్య ప్రయత్నం పాల్పడారు అని నాగరాజు తెలిపారు.ఇంకా ఎంత మందిని చంపుతారు మాదిగలపై ఇ లాంటి దాడులు ఆపాలంటే మాదిగ లంతా ఒక్కటై పోరాటానికి సిద్ధం కం డి అని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వ ర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్ ప్రసాద్ పి లుపునిచ్చారు.

# తిరుగులేని స్థాయిలో 'తిమ్మమాంబ' ఉత్సవాలు..!

- కదిరిలో వైకుంఠ ఏకాదశి వైభోగం..
- ఇటీవల కటారుపల్లిలో యోగివేమన జయంతి వేడుక..
- నేడు గూటిబైలులో మహా శివరాత్రి ఉత్సవాలు
- కదిరి కీర్తిని దశ దిశలా వ్యాపింప చేసిన కందికుంట





**శ్రీ సత్యసాయి బ్యూరో – సూర్య వాస్తవం:** కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ కదిరి ప్రాంతాన్ని టూరిజం అప్పుగా తీర్చిదిద్దాలనే దృఢ సంకల్పంతో ముందుకు వెళు తున్నారు. ఈ ప్రాంతంలో నవ నరసింహ క్షేత్రలల్లోకెల్లా ప్రసిద్ధిగాంచిన శ్రీమద్ ఖాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆల యం, కటారుపల్లి యోగివేమన, ప్రపంచ ప్రసిద్ధిగాంచిన తిమ్మమ్మ మర్రిమాను ఆలయాలు ఉన్నాయి. వీటన్నింటికీ ప్రత్యేక గుర్తింపును తీసుకురావడానికి ఎమ్మెల్యే తన వంతు శ్రేయ శక్తుల కృషి చేస్తున్నారు. కదిరిలో ప్రతి ఏటా వైకుంఠ ఏకాదశి సందర్భంగా ప్రత్యేక దర్శనాలు నిర్వహించడం సాధారణమే. అయితే ఈసారి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ప్రత్యేక శ్రద్ధతో.. బెంగళూరు నుంచి ప్రత్యేకంగా పూలు తెప్పించి చేయించిన అలంకరణ, ఏర్పాట్లు భక్తులను పరవశింపజేశాయి. కటారుపల్లిలో యోగి వేమన జయంతి వేడుకలను చరిత్రలో నిలిచిపోయే విధంగా నిర్వహించిన ఘనత కందికుంటకే దక్కుతుంది. ఇప్పుడు మహాశివరాత్రిని పురస్కరించుకొని గూటిబైలు గ్రామం వద్ద వెలసిన తిమ్మమాంబ ఉత్సవాలను మునుపెన్నడూ లేనివిధంగా భారీ స్థాయిలో నిర్వహించి చరిత్ర సృష్టించారు. తిమ్మమ్మ మర్రిమాను 1989 సంవత్సరంలోనే గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ లో చోటు సంపాదించుకున్నప్పటికీ... ఆ స్థాయిలో అభివృద్ధి జరగలేదనే చెప్పాలి. అక్కడ కనీస వసతులు, రహదారి సౌకర్యాలు లేవు. తన విజన్ 'కదిరి టూరిజం సర్క్యూట్'ను అభివృద్ధి చేయడంలో భాగంగా ఈసారి తిమ్మమాంబ ఉత్స వాలను తిరుగులేని స్థాయిలో నిర్వహించి ఎమ్మెల్యే కందికుంట సక్సెస్ అయ్యారు. దేశంలోనే ప్రఖ్యాతి గాంచిన ఈషా ఫౌండేషన్ వారు ఇక్కడ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వ హించడానికి ఒప్పుకోవడం ఆషామాషీ విషయం కాదు. వారిని కూడ కందికుంట మెప్పించి ఒప్పించి సాంస్కృతిక కార్యక్రమా లతో భక్తులను తన్మయత్వం పొందేలా చేయడంలో ఆయన తీసుకున్న చొరవ అభినందనీయం. గతంలో ఎన్నడూ లేని విధంగా జిల్లా ఎస్పీ అక్కడి ఏర్పాట్లను పర్యవేక్షించారంటే ఏ స్థాయిలో ఉత్సవాలు జరిగాయో ఊహించుకోవచ్చు. గడచిన పది రోజులుగా మండల, నియోజకవర్గ స్థాయి యంత్రాంగ మంతా తిమ్మమ్మ మర్రిమాను వద్ద అహర్నిశలు పనిచేసింది. అప్పటికప్పుడు ఎమ్మెల్యే సొంత నిధులు వెచ్చించి రోడ్లు వేయించడం, అక్కడ ఏర్పాట్లు, మూడు రోజులపాటు భోజన వసతి కల్పించడంలో ఆయన చూపిన దాతృత్వం మరువలేనిది. తిమ్మమ్మ మర్రిమాను వద్ద ఐదు కోట్లతో కమ్యూనిటీ హాలు నిర్మించడానికి ఆయన ముందుకు రావడం



ఎంతైనా చెప్పుకోదగ్గ విషయం. అంతకుముందు కదిరిలో ముస్లిం సోదరులు భారీ స్థాయిలో నిర్వహించిన ఇజితిమా కార్యక్రమానికి కావలసిన ఏర్పాట్లు సైతం దగ్గరుండి చేయించారు. కదిరి నియోజకవర్గ ప్రజల ఆదరా భిమానాలు, కష్ట కాలంలో వెన్నంటి నిలిచిన కార్యకర్తల అభిమానాన్ని తలచుకొని తిమ్మమాంబ ఉత్సవాల సందర్భంగా కందికుంట భావోద్వేగానికి లోనయ్యారు. తనకు ఎలాంటి రాజకీయ కుటుంబ నేపథ్యం లేనప్పటికీ.. గెలుపు ఓటములతో సంబంధం లేకుండా గత 20 ఏళు ్లగా అండగా నిలిచిన కదిరి ప్రజలు, టిడిపి కార్యకర్తల రుణం తీర్చుకోవడానికి తన వంతు అహర్నిశలు కష్టపడి పని చేస్తానని బరువెక్కిన హృదయంతో చెప్పిన మాటలు ప్రతి ఒక్కరిని కదిలించాయి. ప్రజలు, కార్యకర్తల పట్ల ఆయనకున్న కమిట్మెంట్ ను తెలియజేశాయి. అంత చిత్తశుద్ధితో పనిచేస్తున్నారు కాబట్టే ఆయనకు రాష్ట్ర స్థాయిలో ఏడో ర్యాంకు వచ్చింది. ఏది ఏమైనా ఆయన కదిరి ప్రాంతాన్ని టెంపుల్ సర్క్యూట్ గా చేయడానికి చేస్తున్న ప్రయత్నాలు సఫలీకృతం కావాలని అందరూ కోరుకుంటున్నారు.

# సూళ్లూరుపేటలో విద్యుత్ వెలుగులకు 70 వసంతాలు

- ఏడు దశాబ్దాల సేవలకు విద్యుత్ శాఖకు ఎమ్మెల్యే డా. నెలవల విజయశ్రీ అభినందనలు

**సూళ్లూరుపేట – సూర్య వాస్తవం:** సూళ్లూరుపేట గడ్డపై విద్యుత్ వ్యవస్థ ప్రారంభమై 70 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆ ప్రాంతంలో ప్రత్యేక ఆనంద వాతావరణం నెలకొంది. 1956లో ప్రారంభమైన విద్యుత్ సరఫరా వ్యవస్థ 2026 నాటికి ఏడు దశాబ్దాల విజయవంతమైన ప్రయాణాన్ని పూర్తి చేసుకోవడం గర్వకారణమని సూళ్లూరుపేట శాసనసభ్యులు డా. నెలవల విజయశ్రీ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె ఒక ప్రకటనలో మాట్లాడుతూ, గత 70 ఏళ్లుగా సూళ్లూరుపేట ప్రజలకు, రైతులకు, వ్యాపార వేత్తలకు, పరిశ్రమలకు నిరంతరం వెలుగులు పంచుతూ అభివృద్ధికి తోడ్పడుతున్న విద్యుత్ శాఖ సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. చిన్న పట్టణంగా ఉన్న సూళ్లూరుపేట నేడు అభివృద్ధి పథంలో దూసుకెళ్తున్నదంటే అందులో విద్యుత్ శాఖ పాత్ర



విశేషమని ఆమె చెప్పారు. ఎండనకా, వాననకా, రాత్రింబవళ్లు ప్రజలకు నిరంతర విద్యుత్ సరఫరా అందించేందుకు కృషి చేస్తున్న విద్యుత్ శాఖ అధికారులకు, ఇంజినీర్లకు, లైన్‌మెన్‌లకు, సిబ్బందికి ఈ వేడుకల సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ పరిధి వరకు విద్యుత్ సేవలు విస్తరించడంలో వారి అంకితభావం ప్రశంసనీయమని అన్నారు. విద్యుత్ సరఫరా కేవలం వెలుగులకే పరిమితం కాకుండా విద్య, వైద్యం, వ్యవసాయం, పరిశ్రమల అభివృద్ధికి కూడా పునాది అయిందని ఎమ్మెల్యే వివ రించారు. భవిష్యత్తులో మరింత నాణ్యమైన, అంతరాయం లేని విద్యుత్ సేవలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. సూళ్లూరుపేట విద్యుత్ శాఖ 70వ వార్షికోత్సవం సందర్భంగా శాఖలో పనిచేస్తున్న ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ, రాబోయే రోజుల్లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# అసైన్మెంట్ భూములు కొనుగోలు చెల్లవు

- దక్కిలి తాహిశీల్దార్ శ్రీనివాసులు ప్రకటన

**దక్కిలి– సూర్య వాస్తవం:** పేదలు, దళిత, గిరిజనుల జీవనోపాధి కోసం ప్రభుత్వం మంజూరు చేసిన అసైన్మెంట్ మరియు దరఖాస్తు భూములు కొనుగోలు చెల్లవని దక్కిలి మండల తాహిశీల్దార్ ఎం. శ్రీనివాసులు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసైన్మెంట్ భూములు, డీకేటి భూములను భూమిలేని నిరుపేదలకు దళిత గిరిజనులకు ప్రభుత్వాలు పట్టాలు ఇచ్చి ఉన్నారని. ఆ భూములను భూమి హక్కుదారులు వారు వారసులు భూమి సాగు చేసుకొని అందులో ఫలసాయాన్ని పొందుటకు హక్కుదారులని వాటిని అమ్మే అధికారం మాత్రం వారికి లేదన్నారు. అసైన్మెంట్ భూములున్న పేదవారి ఆర్థిక కుటుంబ అవసరాలను ఆసరాగా చేసుకుని పట్టా భూముల కంటే అతి తక్కువ ధరకు కొందరు వాటిని కొనుగోలు చేసి ఉన్నారని వాటిపై అక్కడక్కడ ఫిర్యాదులు వస్తున్నాయని అలా ఎవరైనా అసైన్మెంట్ భూములు మరియు దరఖాస్తు భూములు కొనుగోలు చేస్తే చట్టరీత్య చెల్లవన్నారు. అసైన్మెంట్ భూములు కొనుగోలు ఆక్రమణ చట్టరీత్య నేరమని తాహిసిల్దార్ తెలియజేశారు. అసైన్మెంట్ భూ హక్కుల చట్ట ప్రకారం అసైన్మెంట్ భూములను అమ్మటం కొనటం చేయరాదని, ఒకవేళ అసైన్మెంట్ భూములను కలిగి ఉన్న తమ సొంత సామాజిక వర్గం వారు కొనుగోలు చేసిన రెవెన్యూ అధికారులు గ్రామసభ ద్వారా ధ్రువీకరించుకుని కొనుగోలు చేసిన వారు భూమిలేని నిరుపేదలై ఉంటే కొత్తగా అసైన్మెంట్ పట్టా ఇచ్చే అవకాశం ఉందని, అంతేగాని నేరుగా వారికి భూమిపై హక్కులు పొందలేరన్నారు. ఒకవేళ అసైన్మెంట్ భూములను వేరే ఇతర సామాజిక వర్గాలు వారు కొనుగోలు




సమాచారాన్ని గాని మరల అసైన్మెంట్ భూమి హక్కుదారులు ఫిర్యాదులు చేసిన ఎడల రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి నిజమైన అసైన్మెంట్ హక్కుదారులకు తిరిగి తమ భూములను అప్పజెప్పాలని వారికి వ్యవసాయ భూమి ఆవశ్యకత, కుటుంబ జీవనాధారం తదితర అంశాలను అవగాహన భూ రక్షణ ఉంటుందని అలా అసైన్మెంట్ భూములు అమ్మకాలు కొనుగోలుకు రెండుసార్లు వరకు అవకాశం ఉంటుందని మూడో ధపా అసైన్మెంట్ భూములను అమ్ముకుంటే వారి పట్టాను రద్దు చేసే అవకాశం ఉంటుందని అలా ఆ భూములను కొనుగోలు చేసిన పేదవారికి గ్రామ సభ ద్వారా తిరిగి పట్టా ఇవ్వడం లేదా ప్రభుత్వం స్వాధీనం చేసుకునే అవకాశం ఉంటుందని అసైన్మెంట్ భూ చట్టంలో ఉందన్న విషయాన్ని ప్రజలు గ్రహించాలన్నారు. అసైన్మెంట్ భూములుకు ప్రభుత్వం జారీచేసే ఫ్రీ హోల్డ్ ఉత్తర్వులు అనంతరమే క్రయ విక్రయాలకు అవకాశం ఉంటుందన్నారు.

## 19 సంవత్సరాలలోపు పిల్లలందరూ
# తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలి

**- జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్**







**అనంతపురం వైద్యం - సూర్య వాస్తవం:** బుక్కరాయ సముద్రం మండలం కొర్రపాడులో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో నులిపురుగుల నివారణ కోసం ఆల్బెండజోల్ 400 ఎంజి మాత్రలను విద్యార్థినిలకు వేసి కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్, మెజిస్ట్రేట్ ఓ. ఆనంద్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ 19 సంవత్సరాలలోపు పిల్లలందరూ కూడా తప్పని సరిగా ఆల్బెండజోల్ 400ఎంజి టాబ్లెట్ను నమిలి మింగా లని సంవత్సరంలో రెండు సార్లు ఈ టాబ్లెట్ వేసు కోవడం వల్ల నులిపురుగులు నశించి మనం తిన్న ఆహారం బలాన్ని ఇచ్చి పిల్లలు శారీరకంగా మానసికంగా ఎదుగుదలకు ఉపయోగపడుతుందని, ముఖ్యంగా అనీమియా నుండి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు అని ప్రస్తుతం జనాభాలో 33% ప్రజలు అనీమియా తో బాధపడుతున్నారని దీన్ని రెండు శాతంకు తీసుకు రావడానికి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకొని ప్రయత్ని స్తుందని, ప్రభుత్వం తోపాటు ప్రతి ఒక్క తల్లిదండ్రి ఉపాధ్యాంయులు పనిచేయాలని, అనీమియా నుండి విముక్తి పొందడానికి ఆరోగ్యకరమైన అలవాట్లను అలవర్చుకోవాలని ముఖ్యంగా పిల్లలు చదువుపై దృష్టి కేంద్రీకరించి ఉన్నత చదువులు చదువుకోవడానికి నులిపురుగుల నివారణ ఎంతో ముఖ్యమని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 19 సంవత్సరంలోపు పిల్లలందరికీ ఆల్బెండజోల్ 400 ఎంజి టాబ్లెట్లను నమిలి మింగించాలని ఈరోజు వేసుకొని పిల్లలు ఎవరైనా ఉంటే ఈనెల 24వ తేదీ మాపప్ రోజున తప్పనిసరిగా వేసుకోవాలని వైద్య సిబ్బంది అందుకు కావలసిన ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఈ బి దేవి, ఐసిడిఎస్ పీడీ అరుణ కుమారి, ఆర్ ఐ ఓ వెంకటరమణ నాయక్, ఆర్ బి ఎస్ కే పి ఓ డాక్టర్ విష్ణు మూర్తి, మండల తాసిల్దార్ శ్రీధర్ మూర్తి, ఎంపీడీవో సాల్మన్ రాజు, ఎంఈఓ లింగా నాయక్,ఎంపీపీ సునీత,ఆర్ బి ఎస్ కే మేనేజర్ రజిత, పాఠశాల ప్రధానో పాధ్యాయు రాలు సునీత స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ము వైద్యులు డాక్టర్ ఇందిరా ప్రియదర్శిని,డాక్టర్ వినోద్, హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ గంగాధర్ ఇతర సిబ్బంది,, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# ఇంటర్ పరీక్షలను పగడ్బందీ ఏర్పాట్లతో నిర్వహించాలి

**- జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్ రావు**



**అన్నమయ్య బ్యూరో - సూర్య వాస్తవం:** ఇంటర్ మీడి యట్ పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేసి నిర్వహించా లని జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్ రావు అధికారులను ఆదేశించారు. ఈ నెల 23 నుండి ప్రారంభం కానున్న ఇంటర్ పరీక్షలపై వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో సంబంధిత శాఖల అధికారులతో మంగళవారం సమావేశాన్ని నిర్వహించారు. విద్యార్థి దశలో ఇంటర్ మీడియట్ ఎంతో కీలకమని, పరీక్షల నిర్వహణలో ఎటువంటి లోటుపాట్లు, తప్పిదాలు జరగకుండా అన్ని రకాల జాగ్రత్తలను తీసుకోవాలని ఆయన కోరారు. ఇంటర్ పరీక్షలు ఈనెల 23 నుంచి ప్రారంభమై 24 మార్చి వరకు జరుగుతాయని డిఆర్ఓ తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో ఉదయం 9 నుంచి 12 గంటలు వరకు జరుగుతాయని చెప్పారు. మొదటి సంవత్సర పరీక్షలకు 14,607 మంది, ద్వితీయ సంవత్సర పరీక్షలకు 13,328 మంది బ్యాక్ లాగ్ 615 మంది మొత్తం 28,550 మంది హాజరవుతారని చెప్పారు. మొత్తం 50 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. అలాగే విద్యార్థిని, విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు ఉదయం ఎనిమిది గంటలకల్లా చేరుకొని విధంగా చూడాలని, పరీక్ష సమయం తొమ్మిది గంటల తర్వాత ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రాల్లో అనుమతించ బడదని, అలాగే విద్యార్థులు ఎలాంటి సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు, పరీక్ష కేంద్రంలో అనుమతించారని తెలిపారు. ప్రతి ఒక్క పరీక్షా కేంద్రం వద్ద సిసి కెమెరాలను ఏర్పాటు చేయడం జరిగిందని, పరీక్ష కేంద్రాల్లో ఏదైనా సమస్య వస్తే వెంటనే తెలియజేయుటకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయ డం జరిగిందని కంట్రోల్ రూమ్ నెంబర్ 9866112750 కు తెలియజేయవచ్చునని తెలిపారు. పరీక్షా కేంద్రాలవద్ద 163 సెక్షన్ విధించాలని, జెరాక్స్ షాపులను మూసివేయాలని చెప్పారు. విద్యార్థులు ఇబ్బంది పడకుండా త్రాగునీరు, మరుగుదొడ్లు లాంటి మౌలిక వసతులను కల్పించాలని, పరీక్షా కేంద్రాలకు హాజరయ్యేందుకు వీలుగా ఆర్‌టిసి బస్సులను నడపాలని చెప్పారు. పరీక్ష నిర్వహించే సమయంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చూడాలని, పారిశుధ్యం, త్రాగునీటి వసతుల కల్పనను పంచాయితీశాఖ, మున్సిపాల్టీలు పర్యవేక్షించాలని సూచించారు. కేంద్రాలవద్ద పటిష్ట పోలీసు బందోబస్తును ఏర్పాటు చేయాలని చెప్పారు. ప్రతీ పరీక్షా కేంద్రంవద్ద వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయాలన్నారు. ప్రతీ కేంద్రంవద్దా సిట్టింగ్ స్క్వాడ్ తోపాటు, ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఇంటర్ మీడియట్ పరీక్షలకు సంబంధించిన విద్య, పోలీస్, రవాణా, విద్యుత్తు, వైద్య, పోస్టల్, మున్సిపాలిటీ, పంచాయతీ రాజ్ తదితర శాఖలు సమన్వయంతో కలిసి పని చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరీక్షల నిర్వహణ కమిటి, ప్రాంతీయ పర్యవేక్షణాధికారి రవి, డీఈవో సుబ్రహ్మణ్యం, విద్యుత్ శాఖ ఏఈ ఉత్తన్న, మున్సిపల్ శాఖ డివైఈఈ పి.శ్రావణి, డిపిఎమ్ఓ రమేష్ బాబు, ఆర్టీసీ డిఎంఎం.వి.ఆర్. రెడ్డి, ఇన్‌స్పెక్టర్ రామాంజనేయులు, పోస్టల్ అధికారిని నీలిమ తదితరులు పాల్గొన్నారు.



## ఉచిత వైద్య శిబిరం



**కదిరి - సూర్య వాస్తవం:** కదిరి పట్టణంలోని ఇఖ్రా స్కూల్, నిజాంవలి కాలనీ (అల్ ఖైర్ నగర్) లో పీపుల్స్ హెల్త్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ వైద్యులు సిఎస్ ఇస్మాయిల్ ఆజాద్, మదన్ కుమార్ మాట్లాడుతూ పీపుల్స్ హెల్త్ సొసైటీ ఆధ్వర్యంలో పేదల నివసించే ప్రాంతంలో ప్రత్యేకించి బీడీ కార్మికుల నివాస ప్రాంతంలో మెడికల్ క్యాంపు నిర్వహించడం అభినందనీయమన్నారు. వృద్ధులు, మహిళలు, పిల్లలు, బీడీ కార్మికులు శిబిరానికి వచ్చి వైద్య సేవలు పొందారు. పీపుల్స్ హెల్త్ సొసైటీ వారు వీరికి ఉచితంగా మందులు అందించారు. ఈ మెడికల్ క్యాంపులో డాక్టర్లు సిఎస్ ఇస్మాయిల్ ఆజాద్, సివి, మదన్ కుమార్, తన్వీర్ అలీ ఖాన్, ఎం.నిశ్చల, బి. నారాయణస్వామి నాయక్ వైద్య సేవలు అందించారు. పీపుల్స్ హెల్త్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న డాక్టర్లకు నిర్వాహకులు రామక్రిష్ణ, జి.ఎల్. నరసింహులు, జగన్మోహన్, సాంబశివ, ముస్తాక్, బాబ్ జాన్, ఉదయ్ కృతజ్ఞతలు తెలిపారు.





## రైల్వే స్టేషన్లో తప్పిన అగ్నిప్రమాదం

**అనంతపురం- సూర్య వాస్తవం:** అనంతపురం రైల్వే స్టేషన్లో పెనుప్రమాదం తప్పింది. అధికారులు అప్రమత్తంగా వ్యవహరించడంతో పెద్ద ప్రమాదం తృటిలో తప్పడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. మంగళవారం మధ్యాహ్నం రైల్వే కాంపౌండ్ అవతలి నుంచి మంటలు వ్యాప్తి చెందాయి. సరిగ్గా మంటలు 12.50 గంటలు తరువాత రైల్వే పట్టాల పక్కన ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలను అగ్నికీలలు అంటుకున్నాయి. ప్రమాదాన్ని పసిగట్టిన ఆర్పీఎఫ్ సీఐ సుధాకర్రావు, ఎస్ఐ జీపీకే రెడ్డి, హెడ్కానిస్టేబుల్ సుధాకర్, రైల్వే స్టేషన్ మేనేజర్ మాసినేని అశోక్ కుమార్ వారి సిబ్బంది తక్షణ స్పందించి మంటలను అదుపు చేయగలిగారు. నీళ్లు, ఇసుక వేసి మంటలు వ్యాపించకుండా అడ్డుకోగలిగారు. దీంతో మంటలు అదుపులోకి వచ్చాయి. రైల్వే ఆస్తికి ఎటువంటి నష్టం సంభవించలేదు. రైళ్ల రాకపోకలకూ ఎటువంటి ఆటంకం తలెత్తకుండా జాగ్రత్తపడ్డారు.

## పట్టణంలో
# మౌలిక వసతులు కల్పించాలి

**- మున్సిపల్ కమిషనర్‌కు రాయచోటి కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ బాబా సర్దార్ వినతి**



**రాయచోటి - సూర్య వాస్తవం:** పవిత్రమైన రంజాన్ మాసం ఈ నెల 19న ప్రారంభం సందర్భంగా అత్యధిక ముస్లిం మైనార్టీలు ఉన్న రాయచోటి మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డులలో త్రాగు నీటి సరఫరా సక్రమంగా జరగలేదు. రంజాన్ మాసంలో కుటుంబ అవసరాలకు మాత్రమే కాకుండా (రోజా) ఉపవాసాలు కార్యక్రమాలకు నీతి వినియోగం అధికంగా ఉంటుంది. పైసా రంజాన్ మాసాన్ని దృష్టిలో ఉంచుకొని మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలందరికీ తగినన్ని నీళ్లు అందించేలా చర్యలు తీసుకోవాలని, పటంలోని అన్ని మసీదుల పరిసర ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు చెత్తను తొలగించి బ్లీచింగ్ చెల్లి పరిసరాలను అత్యంత పరిశుభ్రంగా ఉంచాలని రాయచోటి కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు బాబా సర్దార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి మున్సిపల్ కమిషనర్ క్యాంపులో ఉన్నందువల్ల మున్సిపల్ మేనేజర్ కు మంగళవారం ఒక వినతిపత్రాన్ని సమర్పించారు. పట్టణం లో కుక్కల బెడద తీవ్రంగా ఉంది రంజాన్ మాసంలో ఉపవాస దీక్ష నిమిత్తం సహాల కోసం వేకో జామున మూడు గంటల సమయం ఉంది చిన్నపిల్లలు వృద్ధులు మసీదులకు పిలుచుంటారు ఆ సమయంలో కుక్కలు దాడి చేసే ప్రమాదం ఎక్కువగా ఉంది కావున భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలవకుండా కుక్కల నియంత్రణకు తగిన చర్యలు కూడా తీసుకోవాలని ఆయన ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధికార ప్రతినిధి మన్సూర్ అలీఖాన్, డిసిసి చీఫ్ సెక్రటరీ అమీర్, డిసిసి ఉపాధ్యక్షుడు దర్బార్, జనరల్ సెక్రెటరీ ఖాదర్ ఖాన్,రియాజ్,రఫీ, చిన్నమండెం మండల అధ్యక్షుడు షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు ఐదు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత

**- శిరసనంబేడు విద్యుత్ ఉపకేంద్రంలో మరమ్మతులు**



**పెళ్లకూరు - సూర్య వాస్తవం:** తిరుపతి జిల్లాలోని పెళ్లకూరు మండల పరిధిలో బుధవారం విద్యుత్ అంతరాయం కలగనుంది. శిరసనంబేడు 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రంలో మరమ్మత్తు పనులు చేపట్టనున్న నేపథ్యంలో పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. శిరసనంబేడు, సీఎన్ పేట, బంగారంపేట, ఊటిపూడి, మోదుగులపాలెం, రోసనూరు గ్రామాలకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. విద్యుత్ మరమ్మత్తు పనులు సమర్థవంతంగా నిర్వహించేందుకు ఈ చర్యలు తీసుకుంటున్నట్లు విద్యుత్ శాఖ ఏడీ వరప్రసాద్ రెడ్డి, ఏఈ హరికృష్ణ విలేకరులతో మాట్లాడుతూ చెప్పారు. వినియోగదారులు, ప్రజలు విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించాలని వారు కోరారు.

# కమనీయం వీరబ్రహ్మేంద్రుని మహా ప్రసాదం

**- భక్తులకు మహా ప్రసాదం పంపిణీ చేసిన మఠాధిపతి ధర్మపత్ని ఉమాదేవి అమ్మ**

**బ్రహ్మంగారిమఠం - సూర్య వాస్తవం:** కాలజ్ఞాన సృష్టికర్త జగద్గురు శ్రీ మద్విరాట్ పోతులూరి శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి మఠం నందు మహాశివరాత్రి మహోత్సవాలలో 4వ రోజు మంగళవారం జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి వారి మఠం మహా నివేదినా మందిరములో మఠాధిపతులు పూజ శ్రీ శ్రీ శ్రీ వీరధర్మజ వెంకటాద్రి స్వాములవారి ధర్మపత్ని శ్రీ ఉమాదేవి అమ్మగారి చేతులు మీదుగా భక్త జనావళికి మహా ప్రసాదం వితరణ నిర్వహించారు. రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన భక్తులు స్థానిక ప్రజలు భక్తిశ్రద్ధలతో ప్రసాదాన్ని అత్యంత పవిత్రంగా స్వీకరించారు. ఈ మహా ప్రసాదం ఉభయ దాతలు కీర్తిశేషులు ధర్మవరం సుందరాచార్యులు జ్ఞాపకార్థం వీరి కుమారులు కీర్తిశేషులు డి.ఎస్ దత్తాత్రేయ శర్మ జ్ఞాపకార్థం వీరి భార్య సూర్య కుమారి 3/1 శ్రీదేవి అమ్మళ్ స్ట్రీట్ , సుభాష్ నగర్, క్రోమ్ పేట్, చెన్నై ఉదయం శ్రీ గోవిందమాంబ సమేత శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాముల వారు గజవాహనంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. అలాగే రాత్రికి పుష్ప రథోత్సవం పలు సంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు.




PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 ( ASSOCIATE EDITOR -N.ARIF ALI )